

తీరు మారాలి

మీరున్నది కూటమి ప్రభుత్వంలో..

- అధికారులు మారకపోవడంపై ఆగ్రహం
- ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారా?
- రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా?
- నియోజకవర్గాల్లో సమస్యలపై ఏకరువు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో నాయకుల మండిపాటు



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ,కలెక్టర్ షాన్‌మోహన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి); కాకినాడసిటీ: "ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు.. ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారు..కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్నామనే సంగతి అధికారులు తెలుసుకోవాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో రకంలా నిబంధనలు ఎలా అమలు చేస్తారు" అంటూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. కాకినాడ రూరల్ వాకలపూడిలో పారిశ్రామిక కాలుష్య బుగ్గితో ప్రజలు నరకం చూస్తున్నారు. ఒక్కరోజు ఇంట్లో లేకపోతే బుగ్గి ఇళ్లల్లో పేరుకుపోతోంది. అటు నియోజకవర్గంలో అనేక చోట్ల కాలువలు కనిపించడం లేదు..అధికారులు వెదికి పెట్టాలి అంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులకు చురకలంటించారు. వెరసి అధికారుల తీరుపై అధికారపక్ష ఎమ్మెల్యే ఆగ్రహాల మధ్య కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమా వేశానికి మంత్రులెవరూ రాకపోవడంతో ముమ్మిడివరం టీడీపీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విప్ హోదాలో సమావేశాన్ని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆది నుంచే వాడివేడిగా..

వ్యవసాయం, జలవనరులు, వైద్య ఆరోగ్యం, డ్వామా, డీఆర్‌డీఏ, ఉచిత ఇసుక విధానం తదితర అంశాలపై చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాలో రైతులకు రబీ సాగులో నాణ్యమైన విత్తనాలు, సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని సమావేశం నిర్ణయించింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ రబీలో రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందన్నారు. కానీ అధికారులు పాత విధానంలోనే ఉండిపోయారని.. పేరు మార్పుపై క్షేత్రస్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన రైస్ మిల్లులకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కానీ అధికారులు మాత్రం రూల్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు చర్చించేందుకు జడ్పీ సమావేశం చక్కని వేదిక అని పేర్కొన్నారు. అటు ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను ఒకసారి పర్యవేక్షించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు సూచించారు.జలజీవన్ మిషన్ కింద ఎక్కడెక్కడో భూగర్భజలాలు తీసి తోడడానికి బదులు పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే విషయమై అధికారులు అధ్యయనం చేయాలని కోరారు.

కాలువపై..పేకాట క్లబ్బా..

ఇరిగేషన్ కాలువను కప్పెట్టేసి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు పేకాట క్లబ్ కట్టాడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కొన్ని ఇరిగేషన్ కాలువలు మాయమైపోయామని, అధికారులు మాత్రం కాగితాల్లో వాటిని చూపుతున్నారన్నారు. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయో వెదికి చూపించాలని అధికారులకు చురకలంటించారు.రూరల్‌పరిధిలో వివిధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోస సమస్యల భారినపడుతున్నా రన్నారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ చుట్టుపక్క పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంపై ఇప్పటికే శాంపిళ్లు సేకరించి పరిశీలనకు పంపామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.కాకినాడ రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ వాకలపూడి ప్రాంతంలో ప్యారీషుగర్స్ నుంచి వచ్చే కాలుష్యంతో నరకం చూస్తున్నామన్నారు. తన నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు.తాగు,సాగు నీరు కాలుష్యం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మండిపడ్డారు.వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైనేజీ కాలువల్లో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదలకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కేజీ బేసిన్ నుంచి గ్యాస్ చమురు తరలించుకుపోతున్న కంపెనీలు రాయల్టీ ఏపీకి కట్టడం లేదని, కట్టించేలా సభలో తీర్మానం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలి..

జడ్పీ పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉచిత ఇసుక ప్రయోజనం చేకూర్చే విధంగా చూడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. ఇకపై సమావేశాలు సమయానికి జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలంతా కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న ఏకైన శాఖ పంచాయతీరాజ్ అని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. కీలక అంశాలపై నాయకులు చేసిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు.సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె . మాధవి, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డిప్యూటీ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

కన్నీళ్లే.. మిగిల్చింది!



ఏకంగా 19 ఏళ్లు జనంతో కలిచి నడిచింది.. వారితో కలిసి మెలసి జీవించింది.. తాము తిన్నదే దానికి పెట్టేవారు.. అదికూడా ఏది పెట్టినా తినేసేది.. తాము వండుకున్న అన్నం.. ఇడ్లీలు.. స్వీట్స్.. పండ్లు ఇలా ఏదైనా సరే ప్రతి రోజూ దాని కోసం దాచి మరీ ఉంచేవారు..దానికి పెడితే మంచిదని భావించేవారు.. అది వస్తే పెట్టేవారు.. వారాలబ్బాయిలా ప్రతి ఇంట్లో అదీ ఒక భాగమే..ఆ ఊరు ప్రజలకు అంతటి పరిచయం ఎవరితోనో తెలుసా ఒక ఏనుగుతో.. ఏనుగుతోనా అని ఆశ్చర్యపోకండి.. అవును మరి ఏనుగుతోనే.. సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలోని చిట్టి బాబాజీ ఆశ్రమంలో ఉంది.. 2009లో అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆశ్రమానికి ఏనుగును బహుమతిగా ఇచ్చారు.. నాటి నుంచి ఇక్కడే ఉంది. జనంతో కలిసి పోయింది.. ఇంతటి అనుబంధం ఉన్న ఏనుగు శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా కన్నుమూసింది. దీంతో ఊరంతా బోరుమంది.. ఏమయ్యిందో తెలుసుకునేందుకు ఆశ్రమానికి చేరుకుని జనంతో కన్నీటి పర్యంతమయ్యారు. - వివరాలు 6లో



జిల్లా పరిశ్రమలు ఎగుమతుల కమిటీ సమావేశంలో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పారిశ్రామికాభివృద్ధికి పాటుపడండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక కార్యశాలను నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం 13వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత పరిశ్రమల అధికారి శ్రీవాణీధర్ చర్చించాల్సిన అంశాలను కమిటీ ముందుంచారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిపై ప్రతి 15 రోజులకొకసారి చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక వేత్తలతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను సమీక్షించారు.పరిశ్రమలకు చెందిన జీవో నెంబరు 75ను అనుసరించి జిల్లాలో 92,980 విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు.మరోసారి సర్వేచేసి సూక్ష్మ, చిన్న మధ్యతరహా ఎంటర్‌ప్రైజర్స్ వివరాలు సచివాలయ ఉద్యోగులు నమోదు చేశారని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో రూ.2,150 కోట్ల పెట్టుబడితో 3300 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగాను ఉపాధి కల్పించే లక్ష్యంతో భారీ పరిశ్రమ రాబోతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం అనుసరించి 226 యూనిట్లు నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాయితీ దరఖాస్తులు పరిశీలించి రూ.4,13,49,888 మంజూరు చేశారు.

కొవ్వూరులో వింత జంతువు.. ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులో పందిలా ఉన్న వింత జంతువు దాడిలో శనివారం ఐదుగురు గాయాలపాలయ్యారు. ఆంధ్ర సుగర్స్ గార్డెన్‌లో ఉండగా సెక్యూరిటీ గార్డు ఎస్.రవికుమార్‌ను కరి చింది.అక్కడ నుంచి అనన్య థియేటర్ వద్దకు చేరుకుని టిఫిన్ చేయడానికి వచ్చిన ఇందిరమ్మకాలనీకి చెందిన ప్రవీణ్ జయరాజ్ కరిచింది. అచ్చాయమ్మకాలనీకి చెందిన కుప్పాల బంగారమ్మ ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా ఢీకొట్టి వెళ్లిపోయింది.ఈ ముగ్గురు గాయాలపాలయ్యారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేశారు. ఈ ముగ్గురితో పాటు మరో ఇద్దరిని కూడా కరిచినట్టు సమాచారం. పందిలా ఉన్న ఆ జంతువు ఎత్తుగా ఉండి.. కొమ్ములున్నట్టు చెబుతున్నారు. నందమూరు వైపు వెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీస్, మునిసిపల్ అధికారులు వరాహాన్ని పట్టుకోవడానికి చర్యలు చేపట్టారు.అడవి పంది అయి ఉంటుందనిఅనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నిజమా..కలా!

రాజమహేంద్రవరంలో శనివారం సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా మార్పువచ్చింది.. ఆదివారం 21వ తేదీన పగలు 8 గంటలు.. రాత్రి 16 గంటలు మాత్రమే ఉంటుందని పెద్ద ఎత్తున పుకారు షికారు చేస్తోంది.. ఇది నిజమే అన్నట్టు ఇలా మబ్బు వేసి కనిపించి కాసేపటికే చీకటిగా మారిపోయింది.. - కొవ్వూరు



కూలి డబ్బులు.. బొక్కుడు!

ఉపాధి నిధులు పక్కదారి

- మస్తర్ల మాయాజాలం
- ఎఫ్ఏల ఇష్టారాజ్యం
- బంధువుల పేరున హాజరు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- తూతూ మంత్రంగా తనిఖీలు
- అనపర్తిలో ఘటనే నిదర్శనం
- రాజానగరంలోనూ ఇంతే..
- కడియంలోనూ మింగేశారు

రాజానగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో తవ్వుతున్న కొద్దీ అవినీతి,అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనుల్లోకి రాని వారికి ,ఊళ్లో లేనివారికి..బంధువులకు బినామీ మస్తర్లు, దొంగ మస్తర్లు నమోదు చేస్తూ భారీస్థాయిలో దో చేస్తున్నారు. జిల్లాలో మొన్న ముక్కినాడ,నిన్న నరేంద్రపురం, నేడు కడియం, అనపర్తి ఇలా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.అధికారులే బిత్తరపోయేలా ఉపాధి దోపిడీలు బయట పడుతున్నాయి. ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నా అధికారుల కళ్లుకప్పి బయటపడుతున్నారా? లేక తనిఖీల సమయంలో సంబంధిత అధికారులకు మా మూళ్లు సమర్పించి ప్రసన్నం చేసుకుంటున్నారో అర్థం కాని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకంటే సామాజిక తనిఖీల్లో మాత్రం అంతా సక్రమంగానే జరుగుతున్నట్లుగా రికార్డులు చూపి స్తున్నారు.అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ల పేర్లు బహిర్గతం చేయకపోవడం, ఏవిధమైన చర్యల్లేకపోవడం అనుమానాలను తావిస్తోంది.

హండ్రెడ్ పర్సెంట్ దోపిడీ..

ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది.జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగుతుంది. మండల స్థాయి అధికారులు వారికే భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో ఇష్టా నుసారం చేస్తున్నారు. ఉపాధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దోపిడీకి పాల్పడుతున్నారు. రాజానగరం , కడియం, అనపర్తి మండలాల్లో జరిగిన ఘటనలే దీనికి నిదర్శనం. రాజానగరం మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో తవ్వుతున్న కొద్దీ అక్రమాలు బయట పడుతూనే ఉన్నాయి. జాబ్ కార్డు పొందిన కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పించాల్సి ఉండగా కేవలం వారం, పది రోజులు మాత్రమే వారితో పనులు చేయిస్తున్నారు.ఆ తరువాత ఫీల్డ్ అసి స్టెంట్లు బినామీ, దొంగ మస్తర్లు నమోదు చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు.సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహించి నామమాత్రంగానే అవినీతి జరిగినట్టు తేల్చి మిన్నకుండిపోతు న్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రాజానగరం మండలంలో మస్తర్ల మాయాజాలంలో ముక్కినాడ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కవల సాయి గిరిధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈయన గత కొన్నేళ్లుగా గ్రామంలో లేనివారితో పాటుగా అసలు ఉపాధి పనుల్లోకి రాని వారికి దొంగ మస్తర్లు, బినామీ మస్తర్లు నమోదు చేస్తూ ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు అధికారులు విచారణలో నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంఘటన విధితమే. సాయి గిరిధర్ విచారణ అనంతరం అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఫీల్డ్ అసిస్టెంట్ సాయి గిరిధర్ గ్రామానికి చెందిన జనసైనికుల్లో ఒకరికి నెల నెలా రూ.50 వేలు వంతున ముట్టజెప్పేం దుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని మూలంగా దొంగ మస్తర్లు, బినామీ మస్తర్లు నమోదు చేస్తున్నట్టు చెబుతున్నారు. రాజానగరం మండలంలో ఇటువంటి వారు చాలా మంది ఉన్నారు. ఇక దివాన్‌చెరువు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడిగా పని చేస్తూ ఉపాధి కార్యాలయ ఉద్యోగులను గుప్పెట్లో పెట్టు కుని బెదిరింపులకు పాల్పతూ అందరిపై పెత్తనం చెలాయించేవాడని కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దివాన్‌చెరువు గ్రామంలో ప్రభుత్వ ఏ కాంట్రాక్టు అయినా ఈయనే చేయాలి. ఒకవేళ కాదంటే సంబంధిత అధికారి బదిలీ, డిప్యు టేషన్‌పై గానీ వెళ్లిపోవాల్సిందేనట. దీంతో అధికా రులు సైతం సదరు ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహార శైలిని పసిగట్టినప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కాలం వెళ్లదీస్తూ వచ్చారని సంబంధిత ఉద్యోగుల వాపోతున్నారు. అప్పటి ఎమ్మెల్యేను అడ్డం పెట్టుకుని దివాన్ చెరువు గ్రామ పరిధిలో చేపట్టిన ఉపాధి పనుల్లో అంతులేని దోపిడీకి పాల్పడినట్టు తెలుస్తోంది.దివాన్‌చెరువు ఫీల్డ్ అసిస్టెంట్ పని తీరుపై అక్టోబరు నెలలో డ్వామా పీడీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. దీనిపై సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారించాల్సి ఉండగా నేటికి కూడా పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.నరేంద్రపురంలో వెలుగు చూసిన అక్రమాలపై డ్వామా ప్రాజెక్టు కార్యాలయం నుంచి విచారణకు ఆదేశించారు.దీనిలో భాగంగా దాదాపు 30 మంది వరకు ఉపాధి హామీలో పనిచేసిన వేతనదారులను విచారించాలని గ్రామస్తులు అధికారులకు నివేదించారు. ఇప్పటికే విచారణ చేపట్టి సదరు ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి ఉంది.అయితే సంబంధిత విచారణాధికారులు నేటికి కూడా ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.మరో వైపు ఇటీవల కడి యం, అనపర్తి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడి సామాజిక తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయారు.అనపర్తి మండలంలో అయితే ఒక ఫీల్డ్ అసిస్టెంట్ ఏకంగా తల్లీ..అన్ననే కూలీలుగా చేర్చుకుని మస్తర్లు వేసి నిధులు పక్కదారి పట్టించడంపై అధికారులే విస్తపోయారు. జిల్లాలో మరింత లోతుగా విచారణ జరిపితే కోట్లాది రూపాయల అవినీతి బయటపడే అవకాశం ఉం టు ంది. ఈ మేరకు ఉన్నతాధికారులు దృష్టిసారించాలి.

ఉపాధిపై కూటమి విజిలెన్స్

ఉపాధిలో అవినీతిని అరికట్టాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.దీనిలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ ఇప్పటికే గ్రామీ ణాభివృద్ధి శాఖలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పోలీసు అధికారిని నియమించారు. ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే ఎక్కువ అవి నీతికి పాల్పడినట్టు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ అయితే వారిపై ఎఫ్ఐ ఆర్ నమోదు చేసి విచారణ చేయాలని పేర్కొ న్నారు.విజిలెన్స్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా అవినీతిని పూర్తిగా నిర్మూలించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

ఇక ఎవరు ఆశీర్వదిస్తారు!

ఏనుగు మృతితో రఘుదేవపురంలో విషాదఛాయలు

ఏమీ అర్థం కావడంలేదు.. నిన్నటి వరకూ మా మధ్యనే ఎంతో చలాకీగా తిరిగింది.. ప్రతి రోజూ ఏనుగును చూసేవాడిని.. రేపటి నుంచి కనబడదంటే తట్టుకోలేక పోతున్నాం.. కన్నీటి పర్యంతమవుతూ ఒక పెద్దాయన అన్న మాట..ఆ గ్రామంలో ప్రతి ఒక్కరిదీ ఇదే పరిస్థితి.. ఎందుకంటే ఒకటా రెండా ఏకంగా 19 ఏళ్ల అనుబంధం.. ఏనుగును ఇంట్లో మనిషిలా చూస్తారు..వారు వండుకున్నదే పెడతారు.. అయినా ఏం మాట్లాడదు.. పెట్టింది తిని ఆశీర్వదించి వెళ్లిపోతోంది.. రేపటి నుంచి ఎవరి వద్ద ఆశీర్వాదం తీసుకోవాలని మరొక పెద్దావిడ కన్నీటి పర్యంతమైంది. శనివారం రఘుదేవపురంలో ఎవరిని కదిపినా ఇదే పరిస్థితి.. ఏనుగు మృతితో ఊరంతా బోరుమని ఏడ్చింది.. ఠీవిగా నడిచి వెళ్లే ఏనుగు.. జీవశ్చవంగా వెళుతుంటే తట్టుకోలేకపోయారు.. సమాధి వరకూ ర్యాలీగా వెళ్లి తుది వీడ్కోలు పలికారు..



రాజమహేంద్రవరం/సీతానగరం, డిసెంబరు 21 ఆంధ్రజ్యోతి : ఏనుగును చూస్తే ఎవరైనా భయపడతారు.. ఆ గ్రామంలో మాత్రం దాని దగ్గరకు వెళ్లి ఆశీ ర్వాదం తీసుకుంటారు. మిగిలిన జంతువులు రోడ్డుపై ఎలా వెళ్లిపోతాయో.. ఏనుగు అంతే.. ఇదెక్కడో మారుమూల కాదు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో పరిస్థితి.. నిన్నటి వరకూ ఆ ఏనుగు జనంతో మమేకమై నడిచింది.. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత కన్నుమూసింది.దీంతో మన జిల్లా లోనూ ఒక ఏనుగు ఉం దని ప్రపంచానికి తెలిసింది.ఆ ఏనుగును చూసేందుకు తండోప తండాలుగా జనం తరలివ చ్చారు. విగతజీవిగా పడి ఉన్న గజేంద్రుడిని చూసి చలించిపోయారు. లేమ్మా అంటూ లేప డానికి ప్రయత్నించారు. అయినా కదలికలేదు. ఏనుగులు 70-80 ఏళ్ల పాటు జీవిస్తాయి. కానీ 'లీలావతి' 18 ఏళ్లకే కన్ను మూయడం ఆ గ్రామస్తులను కలచి వేసింది.అటవీశాఖ అనుమతి మేరకు శనివారం సాయంత్రం పెదకొండేపూడి గ్రామంలోని చిట్టి బాబాజీ ఆశ్రమానికి చెందిన గోసాల సమీపంలో సమాధి చేసి అంత్యక్రియలు నర్విహించారు. బాజా భజంత్రీల మధ్య లీల మృతదేహాన్ని పెద కొండేపూడి తీసుకెళ్లారు

2 గంటలు మృత్యువుతో పోరాడి..

ఆ మూగజీవి తన ప్రాణాలు ఎవరైనా కా పాడ తారని చివరి క్షణం వరకూ కొట్టు మిట్టాడినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. అజీర్తి వల్ల ఎక్కువగా ఇబ్బంది వస్తే కడుపు నొప్పి విపరీతంగా వస్తుంది. ఆ సమయంలో ఏనుగు ప్రవర్తన మారిపోతుంది. కళ్లలోంచి నీళ్లు వస్తాయి. శరీరం లోపల గ్యాస్ పట్టేయడం వల్ల అరవడానికి చాలా ఇబ్బంది అవుతుంది. దీంతో తొండాన్ని నేలపై కొడతాయి. లీలావతి కూడా ఇలా చేసినట్టు తెలుస్తోంది. ఆమ్లాల ఉత్పత్తి అధికం కావడంతో కడుపులో ఫర్మెంటేషన్ బ్యాక్టీ రియా చనిపోయి విపరీతంగా గ్యాస్ పుడు తుంది. అలాంటి సమయంలో కూడా కనీసం రెండు గంటలపాటు తీవ్రంగా ఇబ్బంది పడుతుం ది. అప్పటికీ పట్టించుకోకపోతే అకస్మాత్తుగా కిందప డిపోయి ప్రాణాలు విడుస్తుంది. ఇప్పుడు లీల విషయంలో కూడా అదే జరిగిందా? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. రాత్రి సుమారు 9 గంటల నుంచి చాలా ఇబ్బంది పడి 11.30 గంటల సమయంలో కింద పడిపో యింది. గంట తర్వాత 12.25 గంటలకు తుదిశ్వాస విడిచింది.సాధారణంగా మనిషికి రోజుకు 10 కిలోల వరకూ గ్యాస్‌వాయువులు ఉత్పత్తి అయితే.ఏనుగులకు అంతకు పదింతలు అవుతుంది.

- కన్నీటి పర్యంతమైన గ్రామస్తులు
- తండోపతండాలుగా వచ్చిన జనం
- రేపటి నుంచి ఎలా అని ఆవేదన
- పెదకొండేపూడిలో ఖననం
- ర్యాలీగా వెళ్లిన జనం
- అజీర్తా.. గుండెపోటా?



ఏనుగు మృతదేహంపై పూలు చల్లుతున్న ఎమ్మెల్యే

అసలేం జరిగింది?

లీల శుక్రవారం రాత్రి 7.30గంటల సమ యంలో బాగానే ఉంది. రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కింద పడిపోవడంతో దాని బాగోగులు చూసే మావటిలు తిరు చూర్‌లోని వైద్యుడికి ఫోన్ చేశారు. స్థానిక వైద్యులను వెంటనే రప్పించాలని ఆయన సలహా ఇచ్చారు. స్థానిక వైద్యుడు వచ్చేసరికే లీలావతి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. తొండం అచేతనమైపోయింది. చెవులు నెమ్మదిగా ఊగుతున్నాయి.కళ్లల్లో జీవం దాదాపుగా పోయింది. డాక్టరు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.లీల మరణ సమయానికి 4 టన్నుల బరువు ఉంది.అది సాధారణ బరువే. ఈ వయసులో ఇవి రోజుకు 60 కిలోల వరకూ తింటాయి.అయితే ఈ ఏనుగు మరణానికి సివియర్ ఎసిడోసిస్ కారణంగా తెలుస్తోంది. ఈ జంతువు తిని అరిగించుకునేవి కాకుండా భక్తులు ఇష్టానుసారం అన్నం, ఇడ్లీలు వంటివి పెట్టడంతో అజీర్తి చేసి.. కడుపులో లాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి ఎక్కువై గ్యాస్ అధికంగా విడుదలయ్యే అవకాశం ఉంది.అలా జరిగితే ఊపిరితిత్తులకు గాలి సర ఫరా నిలిచిపోయి వాటితో పాటు, గుండె ఆగిపోయి మరణిస్తాయి.

2009 నుంచి ఇక్కడే..

ఏనుగులు దేవాలయాల్లో, ఆశ్రమాల్లో ఉండడం కొత్త కాదు. మనకు తక్కువ గానీ కేరళ, తమిళనాడులో దాదాపు ప్రతి ప్రఖ్యాత దేవాలయంలో ఏనుగులు భక్తులకు ఆశీర్వాదాలను అందిస్తూ వారిచ్చిన దక్షిణను ఒడుపుగా తొం డంతో అందుకుంటాయి.మన జిల్లాలోనూ నిన్నటి వరకూ అటువంటి ఆశ్రమం ఒకటి ఉండేది. ఆ ఆశ్రమానికి వెళితే ఏనుగు ఆశీర్వదించేది.. 2009వ సంవత్సరం ఆగస్టు 10వ తేదీన అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జార్జిఖండ్ సీతానగరం మండలం రఘుదేవపురంలోని సద్గురు శ్రీ చిట్టిబాబాజీ సంస్థానం చారిటబుల్ ట్రస్ట్‌కు 3.5 ఏళ్ల వయసున్న ఏనుగును బహూకరించారు. ఏనుగుకు లీల అని నామకరణం చేశారు.దీనికి ప్రత్యేకంగా ఒక భవనం కూడా నిర్మించారు. అందులోనే మావటిలు ఉండేవారు. ప్రస్తుతం దాని వయస్సు 19 సంవత్సరాలు. మావటిలు ప్రతి రోజూ తెల్లవారుజామున గోదావరి నది స్నానానికి తీసువెళ్లేవారు. తిరిగి వస్తూ మార్గమధ్యంలో భక్తులు పెట్టిన పండ్లు, స్వీట్లు, బ్రెడ్లు ఎవరికి తోచినది వారు తినిపించి లీల ఆశీర్వాదం తీసుకునేవారు.చిన్నతనం నుంచి గ్రా మంలోనే ఉండడంతో గ్రామస్తులను ఎంతో మచ్చిక అయ్యింది.రేపటి నుంచి లీల ఆశీర్వాదం దొరకదన్న వార్త స్థానికులను కలచివేస్తోంది. గ్రామస్తులకు కన్నీళ్లు మిగిల్చింది.



రఘుదేవపురంలో అటవీ అధికారుల విచారణ

మృతిపై విచారణ చేస్తున్నాం..

ఇప్పుడు చనిపోయిన ఏనుగు వయసు 18 ఏళ్లు. ఆశ్రమం మనోభావాలకు అనుగుణంగా నిబంధనల ప్రకారం ఖననం చేస్తాం. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని పాటిస్తాం. మరణానికి కారణాలపై విచారణ మొదలు పెట్టాం. వైద్యుల ప్రాథమిక అంచనా ప్రకారం గుండెపోటుగా భావిస్తున్నాం. పోస్టుమార్టం రిపోర్టు 10 రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ఆ రిపోర్టు ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రవీంద్ర ధామా, తూర్పు అటవీ అధికారి

ఇలా చేస్తే బతికేదేమో!

ఏనుగు ఒక కేజీ తినేసోడాను ఐదారు లీటర్ల నీటిలో కలిపి పట్టించాలని వైద్యులు చెబుతున్నారు.తినేసోడా అందుబాటులో లేకపోతే కనీసం ఉప్పు నీళ్లయినా పట్టించాలని అంటున్నారు. అలా చేస్తే జీర్ణ వ్యవస్థ కుదుట పడుతుంది. లీలావతి విషయంలో కూడా ముందుగా దానికి గమనించి తినేసోడా లేదా ఉప్పు నీళ్లు పట్టిస్తే డాక్టరు వచ్చే వరకైనా ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రోజూ బ్రెడ్ పెట్టేవాడిని..



లీల రాగానే రోజూ ఉదయం షాపులోని బ్రెడ్ పెట్టి ఆశీర్వాదం తీసుకునే వాడిని.. బ్రెడ్ తిన్నాక తొండం తలపై పెట్టి ఆశీర్వదించేది. లీలకు ఆహారం పెడితే వ్యాపారం బాగుంటుందనేది నమ్మకం. లీల మరణించిందన్న వార్త బాధ కలిగించింది. **- అల్లు నరసింహామూర్తి, స్వీట్స్ షాపు యజమాని**

చాలా బాధగా ఉంది..



ఏ పని ప్రారంభించినా లీల ఆశీర్వాదం తప్పనిసరి.. నేను పనిమీద వెడుతున్నాను. శుభం కలగాలని కోరుకునే వాడిని, నా పనులు విజయవంతంగా పూర్తయ్యేవి. ఇప్పుడు లీల మరణించిందని తెలిసి చివరిసారిగా చూసాను.చాలా బాధ అనిపించింది

- మారుతి సాయిచంద్, సీతానగరం

అరటి పండ్లు పెట్టేవాడిని..



నేను రోజూ ఏనుగుకు అరటి పండ్లు పెడితే తిని ఆశీర్వదించేది. లీలకు ఏ రోజైనా పండ్లు పెట్టకపోతే మనశ్శాంతిగా ఉండేది కాదు.దానికి ఆహారం పెట్టి ఆశీర్వాదం తీసుకునేవాళ్లం. ప్రతి రోజూ ఉదయం లీల ఎప్పుడు వస్తుందా అని చూసేవాళ్లం

- మురకొండ రామకృష్ణ , పండ్ల వ్యాపారి

టిఫిన్ పెడితే తినేది..



లీల (ఏనుగు) అంటే మాకు సెంటిమెంట్. రోజూ ఉదయం షాప వద్దకు రాగానే మా హోటల్లో చేసిన టిఫిన్స్ తలో రకం పెట్టేవాళ్లం ఆ టిఫిన్ తిని మమ్మల్ని ఆశీర్వదించేది. రోజు దాని రాకకోసం ఎదురుచూసేవాళ్లం .. ఏనుగు రాకపోతే మాకు డల్‌గా ఉండేది.

- కుంచే సాయి, హోటల్ యజమాని





వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.53 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలతో స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించి తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38,53034 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

సత్యదేవా నిత్యాన్నదానం ట్రస్ట్‌కు

రూ.3.44 లక్షల విరాళం





ఈవోకు రూ.2.44 లక్షలవిరాళం అందజేస్తున్న వీర్ల సూరిబాబు బ్రదర్స్, రూ 1,11,116 విరాళం అందజేస్తున్న గుమ్మడి గురునాధరావు

అన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం ఇద్దరు దాతల నుంచి రూ 3.44 విరాళంగా సమకూరాయి. అన్నవరంనకు చెందిన వీర్ల సూరిబాబు, చక్రరావు, రాము సోదరులు రూ 2,44,348 విరాళంగా సమర్పించగా విశాఖపట్నంనకు చెందిన గుమ్మడిగుర్నాధరావు రూ.1,11,116 అందించారు. దాతలు వేర్వేరుగా ఈ మొత్తాలను ఈవో వీర్ల సుబ్బారావుకు అందించగా దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై బాజాభజంత్రీల నడుమ తోడ్కొనివచ్చి తూర్పు రాజగోపురం ఎదురుగా అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రావులపాలెం సీఆర్సీలో కబడ్డి పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోషియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో 22, 23, 24, 25 తేదీలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగోరి వెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. రావులపాలెం సీఆర్సీ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభి స్తామన్నారు. స్థానిక సీఆర్సీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఉత్తరాఖాండ్‌లో జరిగే నేషనల్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీఆర్సీ ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరక్టర్ నల్లమిల్లి వీరరాఘవ రెడ్డి, చిర్ల కనికిరెడ్డి పాల్గొన్నారు.



ఐటీ చూస్తోంది..

- ఆదాయపు పన్ను శాఖ ఆపరేషన్స్ వెరీ స్పెషల్

వివిధ కోణాల్లో ఆరా..రైడ్స్

● పెద్దాపురం(ఆంధ్రజ్యోతి) :

ఆదాయ పన్ను (ఐటీ) శాఖ సోదాలు చేయాలంటే ఆషామాషీ కాదు. లక్షిత వ్యక్తులు, వారి సన్నిహితులు, బంధువులు, ఉద్యోగులు, ఇలా అందరి ఇళ్లలో ఏకకాలంలో దాడులు జరుపుతుంటారు. ఇంతమంది ఇళ్లలో ఒకేసారి, ఒకే సమయంలో సోదాలు ఎలా సాధ్యం..? ఇంటి తలుపులు తట్టి.. వుయ్ ఆర్ ఫ్రమ్ ఐటీ డిపార్ట్‌మెంట్ అంటూ చకచకా ఇంట్లోకి వెళ్లి అందరి దగ్గర సెల్‌ఫోన్లు తీసుకోవడంతో పాటు ల్యాండ్ లైన్ ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేస్తారు. ఇల్లు, కార్యాలయాల్లో ఇలా సోదాలు జరుగుతుండగానే గేటు దగ్గర భద్రతా సిబ్బంది లోపలివారు బయటకు వెళ్లకుండా, బయటి వారు లోపలికి రాకుండా పహారా కాస్తారు. ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో అంతా ఒకేలా జరిగిపోతుంటుంది. ఇదెలా సాధ్యం..?

డాట్ టూ డాట్



ఒక వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉద్యోగుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు డాట్ టు డాట్ కనెక్షన్ విధానాన్ని ఐటీ అధికారులు అనుసరిస్తారు. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి ఉన్న లింకులనే డాట్ టు డాట్ కనెక్షన్ అంటారు. ఒకసారి ఒక విభాగానికి చెందిన వ్యక్తి, వ్యవస్థపై సోదాలు చేస్తే వెంటనే అదే విభాగానికి చెందిన ఇతరులపై ఐటీ సోదాలు చేయదు. కొంత సమయం తీసుకుంటుంది. మరో విభాగానికి చెందిన వ్యక్తి, సంస్థపై దృష్టి సారిస్తుంది. అయితే స్థానిక పోలీసులు, సీఐడీ, ఇతర నిఘా విభాగాల్లో ఎక్కడైనా చిన్నపాటి నిబంధనల అతిక్రమణ జరిగే అవకాశం ఉండొచ్చు. కానీ ఐటీలో కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. ఐటీ అధికారులు కేవలం సోదాలు నిర్వహించడం, లెక్కలు సరిచూడడం, లెక్కల్లో లేని నగదు, నగలను స్వాధీనం చేసుకోవడం వరకే పరిమితం అవుతారు. నేరుగా కేసులు నమోదు చేయడం సాధ్యం కాదు. లెక్కల్లో లేని నగదుకు సంబంధించి పన్ను, జరిమానా విధించి వసూలు చేస్తారు. ఐటీ సోదాలు పైకి కనిపించేంత సులువుగా ఉండవు. ఒక్కోదానికి సంబంధించి వెనకాల కొన్ని నెలల పాటు పనిచేయాల్సి ఉంటుంది. సోదాలకు సంబంధించిన సమాచారం పరిమిత అధికారులకు మాత్రమే తెలుస్తుంది.

ఎలా సాధ్యం

ఇటీవల పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, ఇళ్లు, కార్యాలయాలు, ఆయా సంస్థల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగుల ఇళ్లు ఇలా ఒకే సమయంలో పదుల సంఖ్యలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐటీ బృందాలు ఏకకాలంలో సోదాలు జరిపాయి. ఎవరిపై అయినా ఇలాగే దాడులు జరుగుతాయి. తెల్లవారకముందే ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ ఎలా నొక్కుతున్నారు..? వారికి అన్ని అడ్రస్‌లు ఎలా తెలుసు..? ఐటీ దాడులు ఎదుర్కొంటున్నవారే కాదు, సాధారణ ప్రజలు, ప్రముఖుల్లోనూ ఇప్పుడు ఇదే ప్రశ్న. పక్కా సమాచారంతోనే ఐటీ అధికారులు సోదాలు చేపడతారు. 'మా సంస్థల్లో పనిచేస్తున్న కొంతమంది క్లర్కుల ఇళ్లలోనూ ఐటీ బృందాలు సోదాలు జరిపాయి. కొన్ని సంవత్సరాలుగా వారు మా వద్ద పనిచేస్తున్నా వారి చిరునామా మాకు తెలియదు. మరి ఐటీ అధికారులకు ఎవరు చెప్పారో..? అని బాధితులు చర్చించుకుంటున్నారు.

సమాచారం ప్రధానం..



పన్ను ఎగవేతదారులు, పెద్దమొత్తంలో లెక్కల్లో లేని నగదు కలిగి ఉన్నవారి సమాచారం ఐటీ శాఖకు రెండు రకాలుగా అందుతుంది. ఒకటి ఎవరైనా ఫిర్యాదు చేయడం, రెండోది ఐటీ విభాగం తన ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ద్వారా నిఘా పెట్టడం. ఐటీ శాఖ ఇన్‌ఫార్మర్ వ్యవస్థ అంత గోప్యంగా ఉంటుంది. వారు ఎవరి సమాచారం సేకరిస్తున్నారనేది ఎవ్వరికీ తెలియదు. ఆరోపణలు వచ్చిన వ్యక్తి, అతని సన్నిహితులకు సంబంధించి భౌతిక ఆధారాలతో పాటు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం అవసరమైన వివరాలు సేకరిస్తారు. ప్రధాన టార్గెట్, అతని సన్నిహితులు, ఎవరెవరి వద్ద నగదు లేదా ఆధారాలు ఉండే అవకాశం ఉంటుందో వారి ఇళ్లు, కార్యాలయాలు, గెస్ట్ హౌస్‌లు, ఫామ్‌హౌస్‌ల వివరాలు తెలుసుకోవడం, ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడికి వచ్చి వెళుతుంటారు..? ఇలా ప్రతీ అంశానికి సంబంధించి పక్కాగా సమాచారం సేకరిస్తారు. ఇందుకోసం ఐటీ బృందాలు సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి స్థాయిని బట్టి కొన్ని రోజులు, నెలలు అత్యంత గోప్యంగా సమాచారం సేకరిస్తారు. ఉదాహరణకు ఐటీ సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి సమాచారాన్ని సేకరించిన తర్వాత అధికారులు దాన్ని ఢిల్లీ ప్రధాన కార్యాలయానికి అందచేస్తారు. ఐటీ విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ అనుమతి మేరకు వారెంట్ తీసుకుంటారు.

స్ట్రైక్ టైం కీలకం

వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాల్సిన సందర్భాల్లో స్ట్రైక్ టైం నిర్ధారిస్తారు. ఉదాహరణకు శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతల నివాసంతో పాటు ఆయన కుటంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సిబ్బంది, ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలకు తెల్లవారుజామున 5.30 గంటలు స్ట్రైక్ టైంగా నిర్ధారిస్తే సరిగ్గా అదే సమయానికి అన్నిచోట్ల సోదాలు ప్రారంభం కావాల్సిందే. అంత కచ్చితంగా జరగాలంటే స్ట్రైక్ టైం కంటే కొంత సమయం ముందే ఐటీ బృందాలు సమీప ప్రాంతానికి చేరుకుని ఉంటాయి. ఇలా చేయకపోతే ఒక సమయంలో ఒకచోట సోదాలు జరుగుతుంటే విషయం తెలుసుకుని మరో చోట ఉన్నవారు పరారవడం, ఆధారాలు మాయం చేసే అవకాశం ఉండడంతో ఐటీ సోదాల్లో స్ట్రైక్ టైం అత్యంత కీలకం.



కేంద్ర బలగాలు

ఐటీ సోదాల సమయంలో భద్రత మరో కీలక అంశం. సోదాలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత భద్రతా సిబ్బంది సహకారం తీసుకుంటారు. గతంలో ఐటీ సోదాలు నిర్వహించే ప్రాంతానికి సంబంధించి స్థానిక పోలీసుల సహకారం తీసుకునేవారు. ముందుగానే వారికి విషయం చెప్పాల్సి రావడం వల్ల కొన్ని సందర్భాల్లో అవతలి వ్యక్తికి సమాచారం వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఐటీ సోదాల సమయంలో స్థానిక పోలీసులు కాకుండా కేంద్ర బలగాలను వెంట తీసుకువెళుతున్నారు. దాడులకు కొన్ని గంటల ముందు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఐటీ కార్యాలయానికి చేరుకుంటాయి.

సీల్డ్ కవర్‌లో..

సోదాలకు అనుమతులు ఇచ్చిన తర్వాత స్థానికంగా ఉండే ఐటీ అధికారులు ఎన్ని ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి ఉంటుందనే సమాచారం మేరకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకుంటారు. ఒకటి, రెండు ప్రాంతాల్లో సోదాలకు 20, 30 మంది సిబ్బంది సరిపోతారనుకుంటే స్థానికంగా ఉండేవారిని వినియోగించుకుంటారు. వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి రావడం, వందల సంఖ్యలో సిబ్బంది అవసరం ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తారు. ఒకరోజు ముందుగానే స్థానిక హెడ్ క్వార్టర్లలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు హోటళ్లలో బస చేస్తారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే ఉంటారు. సోదాలు జరిగే రోజు అవసరాన్ని బట్టి అర్ధరాత్రి తర్వాత, తెల్లవారుజామున ప్రధాన కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్కో బృందాన్ని నడిపే బాధ్యతలు ఒక అధికారికి అప్పగిస్తారు. వారికి సీల్డ్ కవర్‌లో టార్గెట్‌కు సంబంధించిన వివరాలు అందజేస్తారు. సోదాలు జరిపే వ్యక్తి నివాసం, కార్యాలయం సమీపంలోని ల్యాండ్ మార్క్ చెప్పి పంపుతారు. అక్కడికి వెళ్లిన తరువాత సీల్డ్ కవర్ తెరిచి చూస్తే టార్గెట్ ఎవరు, అడ్రస్ ఎక్కడ అనేది తెలుస్తుంది.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తాం

- 'నన్నయ' వీసీ ఆచార్య శ్రీనివాసరావు
- అంతర్ కళాశాలల బెస్ట్‌ఫిజిక్, రెజ్లింగ్ పోటీలు, నన్నయ విశ్వవిద్యాలయం జట్టు ఎంపికల ప్రారంభం



బెస్ట్‌ఫిజిక్ క్రీడాకారులతో నన్నయ విశ్వవిద్యాలయ అధికారులు

దివాన్‌చెరువు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో విశ్వవిద్యాలయంలో మరిన్ని క్రీడావసతులు సమకూర్చి ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్సిటీలో అంతర్ కళాశాలల బెస్ట్ ఫిజిక్, పురుష విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు, రెజ్లింగ్ పురుషుల, స్త్రీల జట్టు ఎంపికలను శనివారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి రెజ్లింగ్‌కు 45 మంది, బెస్ట్ ఫిజిక్‌కు 32 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆదికవి నన్నయ విశ్వవిదాయలయం బెస్ట్ ఫిజిక్ పోటీలు 60,65,70,75,80,85 కిలోల కేటగిరిల్లో నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి మూడు స్థానాల విజేతలకు పతకాలను అందించి అభినందించారు.

ఎంపికైన వారి వివరాలు...

60 కిలోల కేటగిరిలో వై.భరత్ (ఆదిత్య కళాశాల, సూరంపాలెం), షేక్ వల్లీ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఆర్‌కే విశ్వనాథమ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 65 కిలోల కేటగిరిలో ఎం.సాయి లోకేశ్(సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు), ఎస్. దినేష్‌కుమార్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ) ఎన్.నాగసందీప్ (శ్రీకాకతీయ కళాశాల, భీమడోలు), 70 కిలోల కేటగిరిలో ఎస్‌కే మన్సూర్(విష్ణు కళాశాల, భీమవరం), ఎ.జగదీష్ (ఏబీఎన్‌ఎన్ కళాశాల, పాలకొల్లు), పి.భానుచంద్ర (ఆదిత్య కళాశాల, కాకినాడ) 75 కిలోల కేటగిరిలో ఎల్.వి.సూర్యప్రకాశ్ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఎం.జగదీష్ మణికంఠ(డాక్టర్ బీవీ రాజు, భీమవరం), జె.దైవప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ), 80 కిలోల కేటగిరిలో టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), యు.దిలీప్‌కుమార్ (ఏబీఎన్ కళాశాల, కొవ్వూరు)ఎన్.సుకుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 85 కిలోల కేటగిరిలో వై.మోహనసాయిఅభిషేక్ (పీఆర్ కళాశాల, కాకినాడ) కె.జయకర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు) ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకున్నారు. టీమ్ చాంపియన్ షిప్ కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలకు దక్కింది. మిస్టర్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 ట్రోఫీని టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు. బెస్ట్ ఫిజిక్ పురుషుల టీమ్ ఎంపికలో భాగంగా ఉత్తమ ప్రతిభకనబరిచిన టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), ఎల్.వి.సూర్యప్రకాష్ (పి.ఆర్ ప్రభుత్వకళాశాల,కాకినాడ) ఎస్.కె.మన్సూర్ (విష్ణుకళాశాల, భీమవరం) వై.భరత్ (ఆదిత్యకళాశాల, సూరంపాలెం)లను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. పంజాబ్‌లోని గురుదాస్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత పోటీలకు వీరిని పంపనున్నారు.

రెజ్లింగ్ మహిళా పోటీల్లో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది క్రీడాకారులను జట్టుగా ఎంపిక చేశారు. అలాగే రెజ్లింగ్ పురుషుల పోటీల్లో ఫ్రీస్టైల్ విధానంలో 57 నుంచి 97 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొన్నారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 నుంచి 67 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు హాజరై కుస్తీలో ప్రతిభ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని పంజాబ్‌లోని గురుదాస్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత పోటీలకు నన్నయ యూనివర్సిటీ జట్టుగా పంపనున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకచైర్మన్లు కె.సుబ్బారావు, డి.జ్యోతిర్మయి, కార్యదర్శి ఎంవీవీఎస్ మూర్తి, పరిశీలకుడు రమణ ఎంపిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రెజ్లింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కొబ్బరి ధరల పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

స్వల్పంగా మద్దతు ధరలు పెంచుతూ కేబినెట్ నిర్ణయం

మిల్లింగ్‌కోప్రాకు రూ.422, బాల్‌కోప్రాకు రూ.100 మద్దతు ధరపెంపు

అంబాజీపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొబ్బరి మద్దతు ధరలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని కొబ్బరి పండించే రాష్ట్రాల్లో రైతులను ఆదుకునే విధంగా నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేసే ధరలను స్వల్పంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలో పండించే పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు ప్రతి ఏటా డిసెంబరు నెలలో ఆయా రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తుంది. ఈ సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెడుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదించిన అనంతరం పంటలపై మద్దతు ధరలను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తుంది. దీనిలో భాగంగా కొబ్బరికి స్వల్పంగా మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ ఆమోదించింది. 2024 సంవత్సరంలో మిల్లింగ్ కోప్రా రూ.11160 ఉండగా 2025 సంవత్సరానికి రూ.422 పెంచి రూ.11,582గా నిర్ణయించింది. అలాగే 2024లో బాల్‌కోప్రా 12,000 ఉండగా రూ.100 పెంచి రూ.12,100గా నిర్ణయించారు. 2025లో ఆయా రాష్ట్రాల్లో నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొబ్బరి ధరలు రూ.12వేలు పైబడి ఉండటంతో ఇప్పుడు నాఫెడ్ కేంద్రాలు తెరిచిన పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా రైతులు కేంద్రం పెంచిన ధరలపై పెదవిరుస్తున్నారు. కొబ్బరి కనీస మద్దతు ధర రూ.15వేలు పైబడి ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. నష్టాల్లో ఉన్న కొబ్బరిరైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ధరల ను పెంచాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు కోరుతున్నారు.


మార్కెట్‌లో కురిడి కొబ్బరి

రాష్ట్రంలో తగ్గుతున్న గంజాయి కేసులు

- రాజమహేంద్రవరంలో అదుపులోకి వచ్చిన బ్లేడ్ బ్యాచ్‌లు
- కోనసీమ జిల్లాలో గంజాయి సమస్య పెద్దగా లేదు
- రాష్ట్రంలో ఆరువేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్


పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

పి.గన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సమస్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెద్దగా లేదని, రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఆరు నెలల్లో గంజాయి కేసులు సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. నేరాలను అదుపులో ఉంచేందుకు ఏలూరు రేంజ్ పరిధిలోని 6 జిల్లాల్లో పోలీసు అధికారులను సమన్వయం చేయ్యడం జరిగిందన్నారు. గంజాయితో పాటు దొంగతనాలను అరికట్టేందుకు పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని దానిలో భాగంగానే వారు ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా స్టేషన్‌ల పరిధిలో పోలీసులు వారి కదలి కలపై నిఘా ఉంచా రని పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కోనసీమ జిల్లా పి.గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గంజాయిని అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఆర్గనైజేషన్‌లో భాగంగా ఐజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి సమీక్షలు నిర్వహించడంతో పాటు సాంకేతికపరమైన శిక్షణను ఇవ్వడం జరుగు తుందన్నారు. గంజాయి పట్టుబడిన సమయంలో నేరస్తులు పట్ల ఏవిధంగా వ్యహరించాలో సూచి స్తున్నట్టు ఆయన తెలిపారు. గంజాయి కేసుల విషయంలో కాలయాపన చెయ్యకుండా దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి ముద్దాయిలకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. అనవసరమైన కేసులు నమోదు చెయ్య కుండా నిజమైన గంజాయి స్మగ్లర్లను గుర్తించి వారిపైనే కేసులు నమోదు చేసేవిధంగా చర్యలు తీసుకుం టున్నామన్నారు. బ్లేడ్ బ్యాచ్‌లపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, అదేపనిగా నేరాలకు పాల్పడు తున్న వారిపై కొత్త సెక్షన్లు వేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరంలో పోలీసులు నిర్వహిస్తున్న చర్యలతో గత 6నెలలుగా బ్లేడ్ బ్యాచ్‌లు అదుపులోకి వచ్చాయన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకర్స్‌తో సమావేశాలు ఏర్పాటు చేసి కరెంట్ అక్కౌంట్‌లపై నిఘాపెట్టామని చెప్పారు.

డబ్బులు పోగొట్టుకుంటే..

అలాగే బాధితులు డబ్బులు పోగొట్టుకున్న 3 గంటల్లోపు 1930 నెంబర్‌కు కాల్‌చేస్తే ఆ డబ్బు మరో వ్యక్తి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ కాకుండా చూస్తారన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి 13 ఉమ్మడి జిల్లాలు వేదికగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6వేల మంది కానిస్టేబుళ్లకు రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, మరో 18 నెలల్లో ఆ సిబ్బంది అందుబాటులోకి వస్తారన్నారు. కొత్త సిబ్బంది వచ్చిన వెంటనే ముఖ్యంగా సిబ్బంది కొరతతో ఉన్న కోనసీమకు ఎక్కువ మందిని కేటాయిస్తారని ఆయన తెలిపారు. కోనసీమలో ప్రస్తుతం పండుగలు కాలం కావడంతో ఆయా గ్రామాల పెద్దలు, యువతతో ముందుగానే సమావేశాలు ఏర్పాటు చేసి జాతర్ల సమయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తొలుత ఐజీకి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ ఆర్.భీమరాజు, ఎస్‌ఐ బి.శివకృష్ణ, సిబ్బంది స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అందించారు.


పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఐజీకి స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు

చేంజ్ మేకర్‌గా రాజమహేంద్రవరం

శానిటేషన్‌లో ఆర్ఎంసీకి అవార్డులు


అవార్డులతో కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్‌హెచ్‌వో, ఎస్ఎస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన చేంజ్ మేకర్స్ కాంక్లేవ్‌లో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు అవార్డులు లభించాయి. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న శనివారం కమిషనర్‌ను కలిసి అవార్డులను అందించారు. ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 24 రాష్ట్రాల నుంచి 100 పట్టణ స్థానిక సంస్థలు హాజరయ్యాయని తెలిపారు. శానిటేషన్ పరంగా నగరాన్ని మార్చు చేసే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టినందుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థను చేంజ్ మేకర్‌గా గుర్తించడం అభినందనీయమని కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్‌లను అభినందించారు.

సివిల్ సర్జన్లుగా పదోన్నతి

కాకినాడ జీజీహెచ్

సీఎస్ఆర్ఎంవోగా రాజకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబులకు సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఇప్పటి వరకూ డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ రాజకుమారికి కాకినాడ జీజీహెచ్‌లో సీఎస్ఆర్ఎంవోగా, డాక్టర్ శ్రీహరి బాబుకు శ్రీకాకుళం జిల్లా పలాస కిడ్నీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ డయాలసిస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అక్రమంగా తరలిస్తున్న 84 ఆవుల పట్టివేత

రౌతులపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 84 ఆవులను కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం శివారున బీజేపీ జిల్లా యువ అధ్యక్షుడు చిత్ర పాపారావు అడ్డుకున్నారు. రౌతులపూడి పోలీస్‌స్టేషన్ అప్పజెప్పగా ఎస్ఐ వెంకటేశ్వరరావు వాహనాలతో పాటు తరలి స్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆవులను విశాఖ జిల్లా ఏజెన్సీ చింతపల్లి నుంచి హైదారాబాద్‌కు తరలిస్తుండగా ఎస్.అగ్రహారం వద్ద పాపారావు అడ్డుకునిపోలీస్‌లకు అప్పగించారు.


వ్యాన్‌లో తరలిస్తున్న ఆవులు

వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు

ముగిసిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదా వరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో చదువుతున్న విద్యార్థులంతా వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని చాన్సలర్ కేవీవీ.సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగ రంలోని జీజీయూలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో 2రోజులుగా నిర్వహించిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా చాన్సలర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వ్యవసాయం, ఉద్యానవన వంటి అనుబంధ రంగాలు ఇమిడి ఉన్నాయన్నారు. వీసీ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితాలను ప్రభావితం చేసే ఆలోచనలు వినూత్న ఆవిష్కరణలతో చేయవచ్చన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త పీసీ వెంగయ్య మాట్లాడుతూ ప్రకృతికి దగ్గరగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. మంచి ఆహారం తీసుకుంటే ఆసుపత్రికి వెళ్లే అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో కేకే హెర్బల్ ఇండస్ట్రీస్ మేనేజర్ కేఆర్ కథం, బెంగుళూరులోని నెకెసిస్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చంద్రశేఖర్ హీరా మత్, జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సి పాల్స్ ఎండీ ధనరాజు, కె.వల్లీమాధవి, టి.జయానందకుమార్, ఎన్.లీలావతి, బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

డి.నరసింహ కిషోర్


కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

కోరుకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, ఉత్పత్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన కోరుకొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి అనేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతం కంటే ప్రస్తుతం క్రైం రేటు తగ్గిందన్నారు. సైబర్ మోసాలు, దొంగతనాలు, గంజాయి, క్రయ విక్రయాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. బస్టాండ్ సెంటర్, మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత పంచాయతీదేదన్నారు. వారికి వ్యాపారులు సహకరించకపోతే పోలీసులు కేసులు కడతారన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిబ్బందిని ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొబ్బరి మొక్కను నాటారు.

వైద్య వృత్తి పవిత్రమైనది

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్

కరప, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని, తమ వద్దకు వచ్చే పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులోని కాకినాడ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో శనివారం ఫిజియోథెరపీ స్నాతకోత్సవ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష, డైరెక్టర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కోరుకొండ బాబ్జి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని, వారు చెప్పే ఆరోగ్య సమస్యలను ఆసాంతం ఓపిగ్గా విని వైద్యమందిస్తే మంచి డాక్టర్‌గా సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ శివశిరీష ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతను వివరించారు. ఫిజియోథెరపీకి మంచి భవిష్యత్ ఉందని, పుస్తక పఠనం కంటే పేషెంట్‌లకు ట్రీట్మెంట్ చేయడం ద్వారా నేర్చుకున్నది బాగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్య పట్టాలు అందించి ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్, కీళ్ల వ్యాధి నివారణ యూనిట్లను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కారక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ప్రొఫెషర్లు, అధ్యాపకులు, రామకృష్ణ, పేరెంట్స్, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జి

వేటగాళ్లకు చిక్కిన దుప్పి!

ముంజవరప్పాడు గ్రామంలో అధికారుల తనిఖీలు

ఓ ఇంటిలో వేటమాంసం..

గ్రామ శివారులో దుప్పిని చంపిన ఆనవాళ్లు


దుప్పి చర్మాన్ని కాల్చిన ప్రాంతాన్ని చూస్తున్న అధికారులు

రాజవొమ్మంగి డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో కొందరు దుప్పిని చంపి మాసాన్ని ఇంటిలో భద్రపరచుకున్న విషయాన్ని శనివారం అధికారులు వెలుగులోకి తెచ్చారు. కింద్ర పంచాయతీ ముంజవరప్పాడు గ్రామంలో కొందరూ దుప్పిని చంపారనే సమాచారంతో రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి, అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో రాము, ఎఫ్‌బీవో ఆనంద్‌లు గ్రామంలో పర్యటించగా ఓ ఇంటిలో వేట మాంసాన్ని అధికారులు గుర్తించారు. గ్రామస్థుల సమాచారంతో గ్రామ శివారు జీడితోటలో దుప్పిని చంపిన ఆనవాళ్లను కాల్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. సగం కాలి ఉన్న దుప్పి చర్మాన్ని ఆ ప్రాంతంలో గుర్తించారు. కొందరు అనుమానితులను అటవీశాఖాధికారులు శనివారం రాత్రి రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చి దర్యాప్తు చేశారు.


సగం కాలి ఉన్న దుప్పి చర్మం

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

40 కిలోలు స్వాధీనం


నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోతుగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి కారులో 40 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని డొంకరాయి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన ప్రకాష్ జ్యోతిపాస్, రాజమహేంద్రవరానికి చెందిన చల్ల రవీంద్ర కలిసి గంజాయిని హుండాయ్ ఐ10 కారులో తరలిస్తున్నారు. డొంకరాయి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్, తన సిబ్బందితో పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రామవరం ఎంపీడీవో రవికిశోర్ సమక్షంలో అరెస్టు చేశారు. చింతూరు ఇన్‌చార్జ్ సీఐ, ఎటపాక సీఐ కేసు దర్యాప్తు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

బలమైన పునాదులతోనే అద్భుత ఫలితాలు

● ఎస్‌సీఈఆర్‌టీ సైకాలజిస్ట్ కోఆర్డినేటర్ రంగయ్య ● ముగిసిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న రంగయ్య, జయశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు భాష, గణితంలో పునాది అభ్యసనం బలంగా ఉండాలని, అప్పుడే అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఎస్సీఈఆర్‌టీ సైకాలజిస్ట్ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకుడు రంగయ్య, డైట్ ప్రిన్సిపాల్ పి.జయశ్రీ అన్నారు. కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఐదురోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తీసుకున్న శిక్షణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినపుడే మంచి ఫలితం వస్తుందన్నారు. శిక్షణా కోర్సు కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా ఏఎంవో డి.రాంబాబు మాట్లాడుతూ ఐదో దశలో 277 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 6వ దశ శిక్షణ ఈ నెల26 నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంఈవోలు తిరుమలరావు, ఆంజనేయులు, డైట్ లెక్చరర్లు సుజాతరత్నం, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సాగునీరందించేందుకు చర్యలు

సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్‌గా రాము ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతుల నవీన్

గోకవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకుంటానని ఆ ప్రాజెక్టు నూతన చైర్మన్ ఉంగరాల రాము అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకుల నడుమ ఇరిగేషన్ ఈఈ దేవర శ్రీనివాస్ సమక్షంలో చైర్మన్‌గా రాము, వైస్ చైర్మన్‌గా పిల్లి రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఎంతో అనుభవం ఉన్న రాముకు కీలకమైన సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ పదవి లభించడం హర్షణీయమన్నారు. చైర్మన్ రాము మాట్లాడుతూ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఉన్న సుమారు 10వేల ఎకరాలకు సకాలంలో సక్రమంగా సాగునీరందేలా చర్యలు తీసుకుంటానన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సుధాకరరెడ్డి



సుధాకరరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి ఏకగ్రీకవంగా ఎన్నికయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించిన ఎన్నికల అధికారులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు పరిధిలో 16 మంది డీసీ చైర్మన్లు ఉండగా చైర్మన్‌గా మురాల శెట్టి సునీల్‌కుమార్, వైస్ చైర్మన్‌గా తమలంపూడి సుధాకరరెడ్డిలను ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొంకుదురు డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నికల ప్రక్రియకు హాజరైన అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు .. సుధాకరరెడ్డిని అభినందించారు. ఈస్ట్రన్ ప్రాజెక్టు కమిటీ వైఎస్ చైర్మన్‌గా ఎన్నికైన సుధాకరరెడ్డిని కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ సూర్యకుమారి, కర్రి శేషారత్నం అభినందించారు.

గణితశాస్త్ర అభివృద్ధికి

రామానుజన్ కృషి



రాజానగరం: కానవరంలో రామానుజన్ నెంబరు ఆకృతిలో గాయత్రి విద్యార్థులు

» ఘనంగా గణిత దినోత్సవం
» గణితశాస్త్ర పితామహుడికి నివాళి
» విద్యార్థులకు పోటీలు, ప్రదర్శనలు



జాతీయస్థాయి ఆన్లైన్ క్విజ్ ప్రారంభిస్తున్న నన్నయ వీసీ

దివాన్‌చెరువు, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్రవిభాగం ఆధ్వర్యంలో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి ఆన్లైన్ క్విజ్ పోటీలను వీసీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ విజయ నిర్మల, గణిత విభాగాధిపతి టి.హైమావతి తదితరులు రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించామని హైమావతి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రేవతి, బి.మల్లిప్రియ, ఎల్.సుజాత, జి.అశోక్, శ్రీనివాసరావు, వరకుమార్ పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక జడ్పీ ప్లస్ హైస్కూల్లో నిర్వహించిన గణిత దినోత్సవంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి.. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. 20వ శతాబ్దంలో రామానుజన్ గణిత విశ్లేషణ, సంఖ్యా శాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాల్లో విశేష కృషి గణిత పితామహుడుగా పేరొందాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత నమూనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కోణాల సత్తిరాజు, గణిత ఉపాధ్యాయులు జయకృష్ణారెడ్డి, సప్ప శ్రీనివాస్, కె.సుబ్బారెడ్డి, పి.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని కానవరంలో గాయత్రీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రాజెక్టులతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ వీవీవీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ దేవిబంగారం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే దివ్య విద్యా సంస్థల్లో గణిత దినోత్సవం నిర్వహించారు.

కోరుకొండ: స్థానిక సరస్వతి విద్యానికేతన్‌లో సందర్భంగా విద్యార్థులకు రామానుజన్ గణిత టాలెంట్ టెస్ట్, క్రీడోత్సవాలు నిర్వహించి శనివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కాకర బేబి నిర్మలను సత్కరించి బంగారు ఉంగరాన్ని బహూకరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పందలపాకలో లెక్కలు నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం విభాగాల వారీగా ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. హెచ్‌వోడీలతోను, ఉద్యోగులతో మాట్లాడారు.నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ సెక్షన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. పథకాల అమలులో ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. నగరపాలక సంస్థ చేపట్టే వివిధ సర్వేల ప్రగతిని సంబంధిత యాప్‌ల ద్వారా పరిశీలించారు. క్వారీ సెంటర్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీచేశారు. సిబ్బంది అంతా యూనిఫాం ధరించి రెండు షిఫ్టుల విధానంలో పనిచేయాలని సూచించారు. బంకులో త్వరలో ఈవీ చార్జింగ్, సీఎన్‌జీ ఫిల్లింగ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అబ్దుల్ మాలిక్ అస్సర్, సూపరింటెండెంట్ రవికుమార్, ఆర్ఐ సీహెచ్.శ్రీనివాసరావు, ఐసీఎల్ సేల్స్ ఆఫీసర్ అమన్‌సోని, బంక్ ఇన్‌చార్జులు కృష్ణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధనుర్మాస నృత్యారాధన



రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస నృత్యారాధన శనివారం నిర్వహించారు. సప్పా దుర్గాప్రసాద్ నేతృత్వంలో 12 మంది చిన్నారులు పుష్పాంజలి సమర్పించి నృత్యారాధనకు అంకురార్పణ చేశారు. అనంతరం అన్నమాచార్యుల కీర్తనలకు నర్తించారు. కార్యక్రమంలో అర్చకుడు అనంత వల్లభాచార్యులు, ఆలయ ఈవో నాగసురేష్, కమిటీ అధ్యక్షుడు నీలి కోటేశ్వరరావు, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు.

పేదలకు సొంతిల్లు ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సొంతిల్లు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 49వ డివిజన్ సింహాచల్‌నగర్‌లో శనివారం జరిగిన సభలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణతో కలిసి 250 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. సింహాచలనగర్‌లో 250మందికి గతంలో స్థలాలు ఇవ్వగా పట్టాలను రెవెన్యూ వారు హౌసింగ్ లోన్ నిమిత్తం వారి వద్దేనే ఉంచారన్నారు. ప్రస్తుతం వారి లోన్ తీరిపోవడంలో పట్టాలను అందించామన్నారు.ఇదే ప్రాంతంలో గతంలో 390 మందికి పట్టాలు అందించామన్నారు. ఇళ్ల పట్టాలకు పేదలు ఎవ్వరికి ఒక్కరూపాయి కూడా ఇవ్వనవసరం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, దుత్తరపు గంగాధర్, కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధ, నక్కా చిట్టిబాబు, మజ్జి రాంబాబు, వై.శ్రీను, కె.రమణ పాల్గొన్నారు.

శ్యామలంబ ఆలయ భూమి స్వాధీనం



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మంగళవారపు పేట లో శ్యామలాంబ అమ్మవారి దేవస్థానానికి చెందిన సర్వేనెంబరు 824/1ఏ2 లో 109 చ.గ. స్థలాన్ని ఏపీ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ వారు ఓఏ 314/2021 కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఖాళీచేయాలని అక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా వారు స్పందించకపోవడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు దేవస్థానం సీఈవో సీహెచ్‌వీ లక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఈవో కె.నాగేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ మురళీకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ



హెల్మెట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీను నాయక్

అనపర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని హెల్మెట్ వినియోగించడం ద్వారా ప్రాణాలకు రక్షణ కలుగుతుందని అనపర్తి ఎస్ఐ ఎల్ శ్రీను నాయక్ పేర్కొన్నారు. శనివారం అనపర్తి దేవీచౌక్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇంటి వద్ద మనపై ఆదారపడ్డ వారిని గుర్తుకు తెచ్చుకుంటూ హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కెనాల్ రోడ్డు నుండి మెయిన్‌రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి కూటమి నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, కూటమి నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దాలి

కడియం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దినప్పుడే విద్యార్థుల మనసుల్లో ఉపాధ్యాయులు నిలుస్తారని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. శనివారం కడియం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణను పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ గొల్లపల్లి రూ.75వేలు విద్యార్థులకు ఖర్చు చేయడంతో పాటు, దాతల నుంచి రూ.15 లక్షలు సేకరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కడియం, కడియపుసావరం సర్పంచ్‌లు మోసిగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ గొల్లపల్లి భవిష్యత్తులో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గారపాటి సత్య, చిలుకూరి ప్రభ, పల్ల సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు పాటంశెట్టి సూరిబాబు, ఎడ్ల ప్రసాద్, ఉదయ్, 2018-19లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

అనపర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరులోని కర్రి వెంకన్న తోటలో వెలసిన సత్తెమ్మ అమ్మవారి ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వేద పండితులు యాగాలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠలో ముక్కామల మహాశక్తి పీఠాధిపతి శ్రీదర్ స్వామీజీ శిష్యుడు స్వామి సుబ్రహ్మణ్యశర్మ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాదన జరిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన స్వామి సుబ్రహ్మణ్యశర్మను ధర్మకర్తలు కర్రి బులియ్యారెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, కర్రి వెంకటకృష్ణారెడ్డి గంగారత్నం దంపతులు, కర్రి అభిలాష్‌రెడ్డి ప్రవీణ దంపతులు తదితరులు సత్కరించారు.

జీజీహెచ్ మందులకు టెండర్ల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్)కి అవసరమైన మందులు సరఫరా చేయడానికి అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ తెలిపారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలకు ఆసుపత్రిలోని పరిపాలనా కార్యాలయంలో డిసెంబరు 23వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకూ అన్ని పనిదినాల్లో సంప్రదించవచ్చన్నారు.

తొర్రిగడ్డ ప్రాజెక్టు చైర్మన్‌గా వేగి శ్రీనివాస్

సీతానగరం, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): తొర్రిగడ్డ ప్రాజెక్టు చైర్మన్‌గా వేగి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా మందపాటి జగపతి రామకృష్ణరాజు ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళా వందన, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఈఈ ఇరిగేషన్ ఆర్.కాశి విశ్వేశ్వరరావులు ప్రకటించారు. శనివారం సీతానగరం మండల రెవెన్యూ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ వేగి శ్రీనివాస్, వైస్ చైర్మన్ మందపాటి జగపతి రామకృష్ణరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించారు. వారికి ధృవీకరణ పత్రాలు అందజేసారు. అనంతరం తొర్రిగడ్డ ప్రాజెక్టు చైర్మన్ వైస్ చైర్మన్‌లను తిరుమల తిరుపతి దేవస్థానం పాలక వర్గ సభ్యులు మునికోటేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు గద్దే వెంకట కృష్ణ చౌదరి, వలవల రాజా, పోలిన కృష్ణ, జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, పూసలు బాబు, బిజెపి నాయకులు రాపాక వెంకటలక్ష్మి, శ్రీవిద్య , మద్దాల కొండలరావు బాలయోగి తదితరులు అభినందించారు

అన్నదాతల కళ్లలో ఆనందం నింపిన చంద్రబాబు



ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ధాన్యం సేకరించిన గంటలోనే చెల్లింపులు జరిగేలా సీయం చంద్రబాబు చర్యలు చేపట్టడంతో అన్నదాతల కళ్లలో ఆనందం నిండిందని ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.

రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

రంపచోడవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మన్యంలో శారదాదేవీ 175వ జయంతి నేపథ్యంలో రాజమండ్రి రామకృష్ణామఠం ఆధ్వర్యంలో మన్యంలో పలు సేవా కార్యక్రమాలను లోతట్టు గ్రామాల్లో జరిపారు. మారేడుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాజమండ్రి మఠం కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆయా గ్రామాల్లో పర్యటించి గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిషన్ మేనేజర్ స్వామి రఘువీరానందజీ మహారాజ్, స్వామి ప్రజ్ఞనాధనంద జీ మహరాజ్, బి.ఆర్.ఎస్.శ్రీకాంత్, కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

25న సాహితీవేదిక

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గౌతమి గ్రంథాలయంలో బుధవారం సాహితీ వేదిక ఆధ్వర్యంలో 4 పుస్తకాలు ఆవిష్కరిస్తారని కళావేదిక నిర్వాహకులు శనివారం తెలిపారు. సాహితీప్రియులంతా దీన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న సాంకేతిక ఆవిష్కరణలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం భాష్యం బ్లూమ్స్‌లో నిర్వహించిన బ్లూమ్స్ ఎడ్యు ఎక్స్‌పో 2024లో విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఈ ఎక్స్‌పోను నన్నయ ప్రొఫెసర్, ఫిజిక్స్ శాఖాధిపతి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ఆంజనేయులు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు ధ్యానం అవసరమని ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదిత్య ఉభయ డిగ్రీ కళాశాలలకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లకు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ, సవితాల చక్రభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

ఏసు క్రీస్తు మార్గం అనుసరణీయం

రంగంపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రంగంపేట మండలం పెదరాయవరం గ్రామం పెంతేకోస్తు చర్చిలో శనివారం మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్య గ్రాండ్ ఫ్యామిలీ క్రిస్మస్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ, రంగంపేట మండల, పెదరాయవరం గ్రామం ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు రంగంపేట మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి'

రాజానగరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలని దళిత బహుజన నాయకులు డిమాండ్ చేశారు. గాంధీబొమ్మ కూడలిలో శనివారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అమిత్‌షా జాతికి క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి కోకన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'గత ప్రభుత్వ పాలనలోనే ప్రజలకు మేలు'

గోకవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హయాంలోనే ప్రజలకు అన్ని విధాలా లబ్ధి చేకూరిందని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. గోకవరంలోని పాతబస్టాండ్ సమీపంలో శనివారం నిర్వహించిన మాజీ సీఎం జగన్ పుట్టినరోజు కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మహిళలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: జగన్ జన్మదినాన్ని శనివారం వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. సంహిత కన్వెన్షన్ హాల్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, చందన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు రంగంపేట మండలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గల ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. చిన్నారులకు కేక్, స్వీట్స్ పంచారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీపీ ఆర్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

వేంకటేశ్వరస్వామికి కిలో బంగారంతో కిరీటం!



ఆలయ చైర్మన్‌కు 8 గ్రాముల బంగారాన్ని అందిస్తున్న దాతలు


కడియం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర క్షేత్రంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి కిరీటం చేయడానికి సంకల్పించామని దాతలు ముందుకు రావాలని ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియపులంకకు చెందిన దాత పెద్దిరెడ్డి వీరభద్రరావు-మంగ దంపతులు 8 గ్రాముల బంగారాన్ని చైర్మన్ మార్గాని సత్యనారాయణకు అందించారు.



అవార్డు అందుకుంటున్న కళాశాల చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అనూషరెడ్డి

ఐఎస్‌టీఎస్ మహిళా కళాశాలకు ఎక్సలెన్స్ అవార్డు

రాజానగరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తూర్పు గోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు ఎక్సలెన్స్ ఇన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ అవార్డు లభించింది. హైదరాబాదులో తాజ్ డెక్కన్‌లో ఆసియా టుడే మీడియా నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్సులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, ఎంపీ రాజేందర్, ఎంపీ రఘునందన్‌రావు నుంచి ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అనూష రెడ్డిలను శనివారం సత్కరించి అవార్డు అందజేశారు. కళాశాల చైర్మన్ ఉపేందర్‌రెడ్డి ఇక్కడి విలేకరులతో పలు అంశాలపై మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు అంకిత భావంతో కృషి చేశారన్నారు.



నర్సరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సరీ సంఘం

విద్యుత్ వైర్లు దొంగతనంపై ఫిర్యాదు

కడియం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కడియం నుంచి బుర్రిలంక, వెంకయ్యపేట వెళ్లే గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్ మోటారు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నర్సరీ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లడంతో నర్సరీ సంఘం అధ్యక్షులు మల్లు పోలరాజు, కార్యవర్గ సభ్యులు శనివారం వైర్ల దొంగతనం జరిగిన ప్రాంతాలను సందర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం గాద నాగేశ్వరరావు, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళి, గరగ నాగేశ్వరరావు, పిల్లా శ్రీనువాసు, తాడాల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



తీరు మారాలి

మీరున్నది కూటమి ప్రభుత్వంలో..



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ,కలెక్టర్ షాన్‌మోహన్

- అధికారులు మారకపోవడంపై ఆగ్రహం
- ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారా?
- రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా?
- నియోజకవర్గాల్లో సమస్యలపై ఏకరువు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో నాయకుల మండిపాటు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి); కాకినాడసిటీ: "ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు.. ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారు..కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్నామనే సంగతి అధికారులు తెలుసుకోవాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో రకంలా నిబంధనలు ఎలా అమలు చేస్తారు" అంటూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. కాకినాడ రూరల్ వాకలపూడిలో పారిశ్రామిక కాలుష్య బుగ్గితో ప్రజలు నరకం చూస్తున్నారు. ఒక్కరోజు ఇంట్లో లేకపోతే బుగ్గి ఇళ్లల్లో పేరుకుపోతోంది. అటు నియోజకవర్గంలో అనేక చోట్ల కాలువలు కనిపించడం లేదు..అధికారులు వెదికి పెట్టాలి అంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులకు చురకలంటించారు. వెరసి అధికారుల తీరుపై అధికార పక్ష ఎమ్మెల్యే ఆగ్రహాల మధ్య కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమా వేశానికి మంత్రులెవరూ రాకపోవడంతో ముమ్మిడివరం టీడీపీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విప్ హోదాలో సమావేశాన్ని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆది నుంచే వాడివేడిగా..

వ్యవసాయం, జలవనరులు, వైద్య ఆరోగ్యం, డ్వామా, డీఆర్‌డీఏ, ఉచిత ఇసుక విధానం తదితర అంశాలపై చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాలో రైతులకు రబీ సాగులో నాణ్యమైన విత్తనాలు, సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని సమావేశం నిర్ణయించింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ రబీలో రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందన్నారు. కానీ అధికారులు పాత విధానంలోనే ఉండిపోయారని.. పేరు మార్పుపై క్షేత్రస్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన రైస్ మిల్లులకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కానీ అధికారులు మాత్రం రూల్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు చర్చించేందుకు జడ్పీ సమావేశం చక్కని వేదిక అని పేర్కొన్నారు. అటు ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను ఒకసారి పర్యవేక్షించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు సూచించారు.జలజీవన్ మిషన్ కింద ఎక్కడెక్కడో భూగర్భజలాలు తీసి తోడడానికి బదులు పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే విషయమై అధికారులు అధ్యయనం చేయాలని కోరారు.

కాలువపై..పేకాట క్లబ్బా..

ఇరిగేషన్ కాలువను కప్పెట్టేసి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు పేకాట క్లబ్ కట్టాడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కొన్ని ఇరిగేషన్ కాలువలు మాయమైపోయామని, అధికారులు మాత్రం కాగితాల్లో వాటిని చూపుతున్నారన్నారు. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయో వెదికి చూపించాలని అధికారులకు చురకలంటించారు.రూరల్‌పరిధిలో వివిధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోశ సమస్యల భారినపడుతున్నా రన్నారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ చుట్టుపక్క పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంపై ఇప్పటికే శాంపిళ్లు సేకరించి పరిశీలనకు పంపామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.కాకినాడ రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ వాకలపూడి ప్రాంతంలో ప్యారీషుగర్స్ నుంచి వచ్చే కాలుష్యంతో నరకం చూస్తున్నామన్నారు. తన నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు.తాగు,సాగు నీరు కాలుష్యం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మండిపడ్డారు.వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైనేజీ కాలువల్లో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదలకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కేజీ బేసిన్ నుంచి గ్యాస్ చమురు తరలించుకుపోతున్న కంపెనీలు రాయల్టీ ఏపీకి కట్టడం లేదని, కట్టించేలా సభలో తీర్మానం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలి..

జడ్పీ పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉచిత ఇసుక ప్రయోజనం చేకూర్చే విధంగా చూడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. ఇకపై సమావేశాలు సమయానికి జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలంతా కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న ఏకైన శాఖ పంచాయతీరాజ్ అని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. కీలక అంశాలపై నాయకులు చేసిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు.సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె. మాధవి, ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, డిప్యూటీ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

కన్నీళ్లే.. మిగిల్చింది!



ఏకంగా 19 ఏళ్లు జనంతో కలిచి నడిచింది.. వారితో కలిసి మెలసి జీవించింది.. తాము తిన్నదే దానికి పెట్టేవారు.. అదికూడా ఏది పెట్టినా తినేసేది.. తాము వండుకున్న అన్నం.. ఇడ్లీలు.. స్వీట్స్.. పండ్లు ఇలా ఏదైనా సరే ప్రతి రోజు దాని కోసం దాచి మరీ ఉంచేవారు..దానికి పెడితే మంచిదని భావించేవారు.. అది వస్తే పెట్టేవారు.. వారాలబ్బాయిలా ప్రతి ఇంట్లో అదీ ఒక భాగమే..ఆ ఊరు ప్రజలకు అంతటి పరిచయం ఎవరితోనో తెలుసా ఒక ఏనుగుతో.. ఏనుగుతోనా అని ఆశ్చర్యపోకండి.. అవును మరి ఏనుగుతోనే.. సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలోని చిట్టి బాబాజీ ఆశ్రమంలో ఉంది.. 2009లో అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆశ్రమానికి ఏనుగును బహుమతిగా ఇచ్చారు.. నాటి నుంచి ఇక్కడే ఉంది. జనంతో కలిసి పోయింది.. ఇంతటి అనుబంధం ఉన్న ఏనుగు శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా కన్నుమూసింది. దీంతో ఊరంతా బోరుమంది.. ఏమయ్యిందో తెలుసుకునేందుకు ఆశ్రమానికి చేరుకుని జనంతో కన్నీటి పర్యంతమయ్యారు. - వివరాలు మెయిన్‌లో



జిల్లా పరిశ్రమలు ఎగుమతుల కమిటీ సమావేశంలో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పారిశ్రామికాభివృద్ధికి పాటుపడండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక కార్యశాలను నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం 13వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత పరిశ్రమల అధికారి శ్రీవాణీధర్ చర్చించాల్సిన అంశాలను కమిటీ ముందుంచారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిపై ప్రతి 15 రోజులకొకసారి చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామికవేత్తలతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను సమీక్షించారు.పరిశ్రమలకు చెందిన జీవో నెంబరు 75ను అనుసరించి జిల్లాలో 92,980 విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు.మరోసారి సర్వేచేసి సూక్ష్మ, చిన్న మధ్యతరహా ఎంటర్‌ప్రైజర్స్ వివరాలు సచివాలయ ఉద్యోగులు నమోదు చేశారని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో రూ.2,150 కోట్ల పెట్టుబడితో 3300 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగాను ఉపాధి కల్పించే లక్ష్యంతో భారీ పరిశ్రమ రాబోతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం అనుసరించి 226 యూనిట్లు నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాయితీ దరఖాస్తులు పరిశీలించి రూ.4,13,49,888 మంజూరు చేశారు.

కొవ్వూరులో వింత జంతువు.. ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులో పందిలా ఉన్న వింత జంతువు దాడిలో శనివారం ఐదుగురు గాయాలపాలయ్యారు. ఆంధ్ర సుగర్స్ గార్డెన్‌లో ఉండగా సెక్యూరిటీ గార్డు ఎస్.రవికుమార్‌ను కరి చింది.అక్కడ నుంచి అనన్య థియేటర్ వద్దకు చేరుకుని టిఫిన్ చేయడానికి వచ్చిన ఇందిరమ్మకాలనీకి చెందిన ప్రవీణ్ జయరాజ్ కరిచింది. అచ్చాయమ్మకాలనీకి చెందిన కుప్పాల బంగారమ్మ ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా ఢీకొట్టి వెళ్లిపోయింది.ఈ ముగ్గురు గాయాలపాలయ్యారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేశారు. ఈ ముగ్గురితో పాటు మరో ఇద్దరిని కూడా కరిచినట్టు సమాచారం. పందిలా ఉన్న ఆ జంతువు ఎత్తుగా ఉండి.. కొమ్ములున్నట్టు చెబుతున్నారు. నందమూరు వైపు వెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీస్, మునిసిపల్ అధికారులు వరాహాన్ని పట్టుకోవడానికి చర్యలు చేపట్టారు.అడవి పంది అయి ఉంటుందనిఅనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నిజమా..కలా!

రాజమహేంద్రవరంలో శనివారం సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా మార్పువచ్చింది.. ఆదివారం 21వ తేదీన పగలు 8 గంటలు.. రాత్రి 16 గంటలు మాత్రమే ఉంటుందని పెద్ద ఎత్తున పుకారు షికారు చేస్తోంది.. ఇది నిజమే అన్నట్టు ఇలా మబ్బు వేసి కనిపించి కాసేపటికే చీకటిగా మారిపోయింది.. - కొవ్వూరు

కూలి డబ్బులు.. బొక్కుడు!



ఉపాధి నిధులు పక్కదారి

- మస్తర్ల మాయాజాలం
- ఎఫ్‌ఏల ఇష్టారాజ్యం
- బంధువుల పేరున హాజరు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- తూతూ మంత్రంగా తనిఖీలు
- అనపర్తిలో ఘటనే నిదర్శనం
- రాజానగరంలోనూ ఇంతే..
- కడియంలోనూ మింగేశారు

రాజానగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో తవ్వుతున్న కొద్దీ అవినీతి,అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనుల్లోకి రాని వారికి ,ఊళ్లో లేనివారికి..బంధువులకు బినామీ మస్తర్లు, దొంగ మస్తర్లు నమోదు చేస్తూ భారీస్థాయిలో దో చేస్తున్నారు. జిల్లాలో మొన్న ముక్కినాడ,నిన్న నరేంద్రపురం, నేడు కడియం, అనపర్తి ఇలా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.అధికారులే బిత్తరపోయేలా ఉపాధి దోపిడీలు బయట పడుతున్నాయి. ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నా అధికారుల కళ్లుకప్పి బయటపడుతున్నారా? లేక తనిఖీల సమయంలో సంబంధిత అధికారులకు మా మూళ్లు సమర్పించి ప్రసన్నం చేసుకుంటున్నారో అర్థం కాని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకంటే సామాజిక తనిఖీల్లో మాత్రం అంతా సక్రమంగానే జరుగుతున్నట్లుగా రికార్డులు చూపిస్తున్నారు.అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ల పేర్లు బహిర్గతం చేయకపోవడం, ఏవిధమైన చర్యల్లేకపోవడం అనుమానాలను తావిస్తోంది.

హండ్రెడ్ పర్సెంట్ దోపిడీ..

ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది.జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగుతుంది. మండల స్థాయి అధికారులు వారికే భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో ఇష్టా నుసారం చేస్తున్నారు. ఉపాధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దోపిడీకి పాల్పడుతున్నారు. రాజానగరం , కడియం, అనపర్తి మండలాల్లో జరిగిన ఘటనలే దీనికి నిదర్శనం. రాజానగరం మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో తవ్వుతున్న కొద్దీ అక్రమాలు బయట పడుతూనే ఉన్నాయి. జాబ్ కార్డు పొందిన కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పించాల్సి ఉండగా కేవలం వారం, పది రోజులు మాత్రమే వారితో పనులు చేయిస్తున్నారు.ఆ తరువాత ఫీల్డ్ అసి స్టెంట్లు బినామీ, దొంగ మస్తర్లు నమోదు చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు.సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహించి నామమాత్రంగానే అవినీతి జరిగినట్టు తేల్చి మిన్నకుండిపోతు న్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రాజానగరం మండలంలో మస్తర్ల మాయాజాలంలో ముక్కినాడ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కవల సాయి గిరిధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈయన గత కొన్నేళ్లుగా గ్రామంలో లేనివారితో పాటుగా అసలు ఉపాధి పనుల్లోకి రాని వారికి దొంగ మస్తర్లు, బినామీ మస్తర్లు నమోదు చేస్తూ ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు అధికారులు విచారణలో నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంఘటన విధితమే. సాయి గిరిధర్ విచారణ అనంతరం అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఫీల్డ్ అసిస్టెంట్ సాయి గిరిధర్ గ్రామానికి చెందిన జనసైనికుల్లో ఒకరికి నెల నెలా రూ.50 వేలు వంతున ముట్టజెప్పేం దుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని మూలంగా దొంగ మస్తర్లు, బినామీ మస్తర్లు నమోదు చేస్తున్నట్టు చెబుతున్నారు. రాజానగరం మండలంలో ఇటువంటి వారు చాలా మంది ఉన్నారు. ఇక దివాన్‌చెరువు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడిగా పని చేస్తూ ఉపాధి కార్యాలయ ఉద్యోగులను గుప్పెట్లో పెట్టు కుని బెదిరింపులకు పాల్పతూ అందరిపై పెత్తనం చెలాయించేవాడని కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దివాన్‌చెరువు గ్రామంలో ప్రభుత్వ ఏ కాంట్రాక్టు అయినా ఈయనే చేయాలి. ఒకవేళ కాదంటే సంబంధిత అధికారి బదిలీ, డిప్యు టేషన్‌పై గానీ వెళ్లిపోవాల్సిందేనట. దీంతో అధికా రులు సైతం సదరు ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహార శైలిని పసిగట్టినప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కాలం వెళ్లదీస్తూ వచ్చారని సంబంధిత ఉద్యోగుల వాపోతున్నారు. అప్పటి ఎమ్మెల్యేను అడ్డం పెట్టుకుని దివాన్ చెరువు గ్రామ పరిధిలో చేపట్టిన ఉపాధి పనుల్లో అంతులేని దోపిడీకి పాల్పడినట్టు తెలుస్తోంది.దివాన్‌చెరువు ఫీల్డ్ అసిస్టెంట్ పని తీరుపై అక్టోబరు నెలలో డ్వామా పీడీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. దీనిపై సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారించాల్సి ఉండగా నేటికి కూడా పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.నరేంద్రపురంలో వెలుగు చూసిన అక్రమాలపై డ్వామా ప్రాజెక్టు కార్యాలయం నుంచి విచారణకు ఆదేశించారు.దీనిలో భాగంగా దాదాపు 30 మంది వరకు ఉపాధి హామీలో పనిచేసిన వేతనదారులను విచారించాలని గ్రామస్తులు అధికారులకు నివేదించారు. ఇప్పటికే విచారణ చేపట్టి సదరు ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి ఉంది.అయితే సంబంధిత విచారణాధికారులు నేటికి కూడా ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.మరో వైపు ఇటీవల కడి యం, అనపర్తి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడి సామాజిక తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయారు.అనపర్తి మండలంలో అయితే ఒక ఫీల్డ్ అసిస్టెంట్ ఏకంగా తల్లీ..అన్ననే కూలీలుగా చేర్చుకుని మస్తర్లు వేసి నిధులు పక్కదారి పట్టించడంపై అధికారులే విస్తపోయారు. జిల్లాలో మరింత లోతుగా విచారణ జరిపితే కోట్లాది రూపాయల అవినీతి బయటపడే అవకాశం ఉం టు ంది. ఈ మేరకు ఉన్నతాధికారులు దృష్టిసారించాలి.

ఉపాధిపై కూటమి విజిలెన్స్

ఉపాధిలో అవినీతిని అరికట్టాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.దీనిలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ ఇప్పటికే గ్రామీ ణాభివృద్ధి శాఖలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పోలీసు అధికారిని నియమించారు. ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే ఎక్కువ అవి నీతికి పాల్పడినట్టు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ అయితే వారిపై ఎఫ్ఐ ఆర్ నమోదు చేసి విచారణ చేయాలని పేర్కొ న్నారు.విజిలెన్స్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా అవినీతిని పూర్తిగా నిర్మూలించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

ఎస్పీ నరసింహ కిషోర్

కోరుకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, ఉత్పత్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తూర్పుగోదావరి జిల్లా సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన కోరుకొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతం కంటే ప్రస్తుతం క్రైం రేటు తగ్గిందన్నారు. సైబర్ మోసాలు, దొంగతనాలు, గంజాయి, క్రయ విక్రయాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే కోరుకొండ నరసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. బస్టాండ్ సెంటర్, మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత పంచాయతీదేదనని, వారికి వ్యాపారులు సహకరించకపోతే పోలీసులు కేసులు కడతారన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొబ్బరి మొక్కను నాటారు.

రైతు సేవలో ఎస్‌బీఐ ముందంజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్ఎం రమేష్‌నాయుడు

తాళ్లపూడి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటూ వారికి కావలసిన వ్యవసాయ పరికరాలకు రుణ సదుపాయం, ఆర్థికపరమైన విషయంలో రైతు సేవా కార్యక్ర మాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుంటుందని బ్రాంచ్ మేనేజరు బి.వెంకటయ్య తెలిపారు. మండలంలోని ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం రైతాంగ దినోత్సవం నిర్వహించారు. దీనికి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.రమేష్ నాయుడు, చీఫ్ మేనేజర్ రమణకుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి రుచిత మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది రైతాంగానికి సహాయకారిగా ఉంటారని కొనియాడారు. అనంతరం ఆమెను బ్యాంక్ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, క్యాషియర్ ప్రేమ్‌కుమార్ రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నిడదవోలులో చెక్కులను అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు సుమారు రూ.15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఒక వైపు వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే మరో వైపు అత్యవసర సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి వైఎస్ జగన్ కృషి



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి వనిత

దేవరపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు శనివారం పలుచోట్ల పార్టీ నాయకులు నిర్వహించారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వనిత ప్రారంభించారు. కేకును కట్ చేశారు. కృష్ణంపాలెంలో బీఆర్ అంబేడ్కర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైసీపీ మండలాధ్యక్షుడు కూచిపూడి సతీష్, నరహరిశెట్టి రాజేంద్రబాబు, గడా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని వైసీ పీ కార్యాలయంలో నాయకులు కేక్ కటింగ్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఆహారం అందజేశారు. కార్యక్రమంలో గా జుల రంగారావు, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, వజీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో వైసీపీ నాయకుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు కేక్ కటింగ్ చేశారు. పార్టీ అభిమానులకు స్వీట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వా మి, గంధ్రోతు సురేంద్రకుమార్, జుట్ట ఏడుకొండలు, జుజ్జవరపు రామచంద్రరావు, మట్టా వెంకటరావు, జె.వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీనివాసరావు కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం హైస్కూల్లో స్కూలు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన ఉపాధ్యాయుడు వేంద్ర శ్రీనివాసరావు కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందజేసినట్టు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు కె.మాణిక్యాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం హైస్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. పాఠశాలలో మంచి ఉపాధ్యాయుణ్ని కోల్పోయామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, ఐ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఒత్తిడి దూరం



ఆసనం వేసి చూపుతున్న ఫిజియోథెరపిస్ట్ రమేష్

గోపాలపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యాయమంతోనే ఒత్తిడి జయించవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ రమేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, వీఆర్ఏలకు ఆరోగ్య సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భం గా రమేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లకు లోనవుతూ అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. వాటన్నిటిని జయించేందుకు వ్యాయామం దోహదపడుతుందన్నారు. తహశీల్దార్ అజయ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. అలాగే మండలంలోని గంగోలు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 21 అర్జీలు అందినట్టు తహశీల్దార్ తెలిపారు.

బలమైన పునాదులతోనే అద్భుత ఫలితాలు

● ఎస్‌సీఈఆర్‌టీ సైకాలజిస్ట్ కోఆర్డినేటర్ రంగయ్య ● ముగిసిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న రంగయ్య, జయశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు భాష, గణితంలో పునాది అభ్యసనం బలంగా ఉండాలని, అప్పుడే అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఎస్‌సీఈఆర్‌టీ సైకాలజిస్ట్ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకుడు రంగయ్య, డైట్ ప్రిన్సిపాల్ పి.జయశ్రీ అన్నారు. కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఐదురోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తీసుకున్న శిక్షణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినపుడే మంచి ఫలితం వస్తుందన్నారు. శిక్షణా కోర్సు కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా ఏఎంవో డి.రాంబాబు మాట్లాడుతూ ఐదో దశలో 277 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 6వ దశ శిక్షణ ఈ నెల26 నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంఈవోలు తిరుమలరావు, ఆంజనేయులు, డైట్ లెక్చరర్లు సుజాతరత్నం, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే

ప్రభుత్వ లక్ష్యం



ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు అందిస్తున్న మంత్రి దుర్గేష్



మెగా జాబ్‌మేళాకు హాజరయిన యువతీయువకులు

» రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్
» స్కిల్‌ను డెవలప్‌చేసుకోవాలి: కలెక్టర్
» 609 మందికి ఆఫర్ లెటర్లు : ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు
» కొవ్వూరులో మెగా జాబ్ మేళా

కొవ్వూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరులోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో శనివారం వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉద్యోగాలకు ఎంపికయిన వారికి దుర్గేష్ ఆఫర్ లెటర్‌లను అందజేశారు. జాబ్‌మేళాకు విచ్చేసిన కంపెనీల ప్రతినిధులను ఎమ్మెల్యే ముప్పిడి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు సుమారు 1500 మంది హాజరవ్వగా ఇప్పటివరకు 600 మంది వివిధ కంపెనీల ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారన్నారు. ఒకరికి రూ.5 లక్షల వేతనంతో హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం వచ్చిందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నిరంతర సాధన చేస్తే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. మొబైల్ చేతిలో ఉంటే ప్రపంచం మన చేతిలో ఉన్నట్లేనన్నారు. మొబైల్‌లో యూట్యూబ్, వీడియోలు కాకుండా కెరియర్ గైడెన్స్ మెటీరియల్‌ను ఉపయోగించుకుని కంపెనీలు మన దగ్గరకు వచ్చేలా సాధన చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యం ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంటు పాలసీని ఏర్పాటు చేసిందన్నారు. అందరికీ ఉపాధి కల్పించాలని హైస్కూల్ నుంచి డిగ్రీ వరకు స్కిల్ ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. అలాగే ఇంటింటికీ స్కిల్ సర్వే చేపట్టిందన్నారు. సీనియర్ విద్యార్థులు, జూనియర్స్‌కు మంచి విషయాలను షేర్ చేసి మార్గ దర్శకులుగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను అంచెలంచెలుగా భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, మెగా డీఎస్సీ తీస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. వికాస పీడీ లచ్చారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాలో విద్యార్హతలను బట్టి ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందన్నారు. 1200 మంది యువత రిజిస్ట్రేషన్ చేయించుకోగా శనివారం సాయంత్రానికి 609 మందికి ఆఫర్ లెటర్ అందజేశామని, మిగిలినవారికి మరో నాలుగు రోజుల్లో అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవో రాణి సుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, కాగిత రఘు, చిరంజీవి, సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి

రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్
సుబ్రహ్మణ్యం మృతి



కొవ్వూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్, ప్రభుత్వ నీటి పారుదల మాజీ సలహాదారుడు పారుపూడి సూర్య రామ సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో మృతిచెందారు. హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. మృతదేహాన్ని స్వస్థలమైన కొవ్వూరుకు తీసుకొచ్చి ఆదివారం అంతిమయాత్ర చేపట్టనున్నట్టు సమాచారం. సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ తరువాత గోష్పాదక్షేత్రంలో సుందర గోవిందుడి గోశాల నిర్మాణం చేపట్టారు. కొంతకాలంగా చక్ర పూజలు, చండీ యాగాలతో పాటు ఆధ్యాత్మికంగా సేవలందిస్తున్నారు.

కాకినాడ జీజీహెచ్ సీఎస్
ఆర్ఎంవోగా రాజకుమారి

తూర్పుగోదావరి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణికి పదోన్నతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబులకు సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఇప్పటి వరకూ డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ రాజకుమారికి కాకినాడ జీజీహెచ్‌లో సీఎస్ఆర్ఎంవోగా, డాక్టర్ శ్రీహరిబాబుకు శ్రీకాకుళం జిల్లా పలాస కిడ్నీ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ అండ్ డయాలసిస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు.

చేంజ్ మేకర్‌గా
రాజమహేంద్రవరం

శానిటేషన్‌లో ఆర్ఎంసీకి అవార్డులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన చేంజ్ మేకర్స్ కాంక్లేవ్‌లో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు అవార్డులు లభించాయి.ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న శనివారం కమిషనర్‌ను కలిసి అవార్డులను అందిచారు. ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 24 రాష్ట్రాల నుంచి 100 పట్టణ స్థానిక సంస్థలు హాజరయ్యాయన్నారు.శానిటేషన్ పరంగా నగరం వివిధ కార్యక్రమాలు చేపట్టినందుకు నగరపాలక సంస్థను చేంజ్ మేకర్‌గా గుర్తించడం అభినందనీయమన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్‌లను అభినందించారు.

విద్యార్థులకు స్ర్కీనింగ్ టెస్టులు

ఉండ్రాజవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోర్త గ్రామంలో యూపీ స్కూలు ఆవరణలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం స్ర్కీనింగ్ టెస్టులు నిర్వహించారు. డాక్టర్ ఉషాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బరువు, ఎత్తు, రక్తహీనత నిర్ధారణ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఉండ్రాజవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం శనివారం నిర్వహించారు. పలువురు గణితం విశిష్టతను, రామానుజం సేవలను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో స్థానిక బౌద్ధధమ్మపీఠం అధిపతి అనాలయో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

» దేవరపల్లి తహశీల్దార్ రాజ్యలక్ష్మి
» పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



పల్లంట్లలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పల్లంట్ల గ్రామంలో సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ముందుగా తహశీల్దార్ దళిత వాడల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో 17 అర్జీలు వచ్చాయని, వాటిలో ప్రధానంగా రీసర్వేపై 10, ఆర్‌వోఆర్‌పై 5, మూడు ఇతర సమస్యల పై అర్జీలు అందినట్టు చెప్పారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఏడుగురు రైతులు తమ పొలాల సరిహద్దుల కోసం ఎఫ్‌లైన్ పిటీషన్లు అందించారు. సమావేశంలో సర్పంచ్ గండి రాంబాబు, ఉప సర్పంచ్ దండమూడి శేషు, ఎంపీటీసీ చిన్నబ్బాయి, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని మల్లవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహశీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ భూవివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి గ్రామంలోను సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 అర్జీలు స్వీకరించామన్నారు. సదస్సులో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఆర్ఐ కమాల్, ఉపసర్పంచ్ కోడూరి కాశిగంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



మల్లవరం సదస్సులో తహశీల్దార్ మెరికమ్మ



గజ్జరంలో 1బి ఫారం అందిస్తున్న తహశీల్దార్ రవీంద్రనాథ్

విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

» జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు
» ముగిసిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఛాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో చదువుతున్న విద్యార్థులంతా వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పిలుపునిచ్చారు. జీజీయూలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో వ్యవసాయం, ఉద్యానవన వంటి అనుబంధ రంగాలు ఇమిడి ఉన్నాయన్నారు. వీసీ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితాలను ప్రభావితం చేసే ఆలోచనలు వినూత్న ఆవిష్కరణలతో చేయవచ్చన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త పీసీ వెంగయ్య మాట్లాడుతూ ప్రకృతికి దగ్గరగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. మంచి ఆహారం తీసుకుంటే ఆసుపత్రికి వెళ్లే అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో కేకే హెర్బల్ ఇండస్ట్రీస్ మేనేజర్ కేఆర్ కథం, బెంగుళూరులోని నెకెసిస్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చంద్రశేఖర్ హీరామత్, జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ ఎండీ ధనరాజు, కె.వల్లీమాధవి, టి.జయానందకుమార్, ఎన్.లీలావతి, బి.శ్రీనివాసరాజు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు క్రీస్తుమార్గం అనుసరణీయం

నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్



చిట్యాలలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జాన్‌పీటర్

గోపాలపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో యూత్ క్రిస్మస్, 22వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాన్‌పీటర్ క్రీస్తు జన్మదిన కేకు కోసి విశ్వాసులకు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిస్థాపన, విలువలతో కూడిన సమసమాజ నిర్మాణం కోసం క్రీస్తు తన జీవితంలో ఆచరించి బోధించారని అన్నారు. నేటి యువతకు క్రీస్తు జీవితం స్ఫూర్తి కావాలన్నారు. యవ్వన దశలోనే క్రీస్తు తన ప్రవర్తన బోధతో సామాజిక సేవ కోసం పరితపించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతంగి సరోజిని, టీడీపీ నాయకుడు నూతంగి దొరబాబు, విశ్వాసులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని సెయింట్స్ ఇంగ్లిష్ మీడియం కాన్వెంట్‌లో క్రిస్టమస్ వేడుకలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణలో సందడి చేశారు. క్రీస్తు జననం దృశ్య రూపకాన్ని ప్రదర్శించారు. క్రిస్టమస్ అందరి జీవితాల్లోను వెలుగు నింపాలని కోరుతూ పాఠశాల యాజమన్యం క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, సిస్టర్స్ పాల్గొన్నారు.



నిడదవోలులో క్రీస్తు జననం దృశ్య రూపకంలో విద్యార్థులు

ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సుధాకరరెడ్డి



సుధాకరరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి ఏకగ్రీకవంగా ఎన్నికయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించిన ఎన్నికల అధికారులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు పరిధిలో 16 మంది డీసీ చైర్మన్లు ఉండగా చైర్మన్‌గా మురాల శెట్టి సునీల్‌కుమార్, వైస్ చైర్మన్‌గా తమలంపూడి సుధాకరరెడ్డిలను ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొంకుదురు డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భం గా సుధాకరరెడ్డికి ఎన్నికల అధికారి ధ్రువీకరణపత్రం అందజేశారు. ఎన్నికల ప్రక్రియకు హాజరైన అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు.. సుధాకరరెడ్డిని అభినందించారు. ఈస్ట్రన్ ప్రాజెక్టు కమిటీ వైఎస్ చైర్మన్‌గా ఎన్నికైన సుధాకరరెడ్డిని కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ సూర్యకుమారి, కర్రి శేషారత్నం అభినందించారు.

ధనుర్మాస నృత్యారాధన



రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస నృత్యారాధన శనివారం నిర్వహించారు. సప్పా దుర్గాప్రసాద్ నేతృత్వంలో 12మంది చిన్నారులు పుష్పాంజలి సమర్పించి నృత్యారాధనకు అంకురార్పణ చేశారు.అనంతరం అన్నమాచార్యుల కీర్తనలకు నర్తించారు. కార్యక్రమంలో అర్చకుడు అనంత వల్లభాచార్యులు, ఆలయ ఈవో నాగసురేష్, కమిటీ అధ్యక్షుడు నీలి కోటేశ్వరరావు, యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు.